పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు సెలవు.
సోమవారం సంచిక వెలువడదు.
పున:దర్శనం మంగళవారం.

- మేనేజ్ మెంట్



ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 8 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 143 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar



చీకటిపై వెలుగుల విజయం 2

దేశ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని దీపావళి శుభాకాంక్షలు!
జవాన్లతో కలిసి దీపావళి జరుపుకోనున్న ప్రధాని మోదీ
ఉపరాష్ట్రపతితో దీపావళి శుభాకాంక్షలు పంచుకున్న మోదీ

తాగునీటికే ప్రాధాన్యం



రైతులకు సీఎం సూచన! 2

ఎల్‌నినోతో తగ్గనున్న వర్షాలు.. ఆరుతడి పంటల సాగుకు పిలుపు
కాళేశ్వరం, మేడిగడ్డపై బీఆర్ఎస్‌కు రేవంత్ సవాల్
డిసెంబర్‌లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు యోచన
మక్తల్-కొడంగల్ ఎత్తిపోతలతో పాలమూరుకు సాగునీరు

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలన్న ఆలోచన కూడా కేసీఆర్ చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేశామని తెలిపారు. కొడంగల్‌ను విద్యా, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ప్రకటించారు. కొడంగల్ పర్యటనలో భాగంగా రేడియల్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న కొడంగల్ రేర్ ఇండస్ట్రియల్ హబ్, ఎన్ఏఆర్ఐ పార్క్, హబ్, రైజ్ లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ఆవిష్కరించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు.

-హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి)



త్వరలోనే నామినేటెడ్
పోస్టుల భర్తీ

చైర్మన్లతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి కసరత్తు
త్వరలోనే నియామకాలు పూర్తి చేస్తాం: మహేశ్ గౌడ్
పార్టీ పరిస్థితులపై అధిష్టానానికి నివేదిక
గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపునకు సమష్టి కృషి

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు.

-హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి) 2

ఈ నెల 19 నుంచి
ఉచిత చీరల పంపిణీ!

హైదరాబాద్‌లో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళలకు కానుక
2026 పంపిణీ కోసం రూ.334 కోట్ల కేటాయింపు
95 లక్షల మంది మహిళలకు చీరలు అందించాలని లక్ష్యం
ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాల నమోదు 2

ఎత్తిపోతల పథకం టెండర్లలో
భారీ అవకతవకలు

కొడంగల్ టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్
రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయం పెంపు..
ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ 2



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు.

-హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి)

నైనీ గని నుంచి బొగ్గు ఉత్పత్తి పెంపునకు చర్యలు



తెలంగాణ విద్యుత్ అవసరాలకు రోజుకు 20 వేల టన్నుల సరఫరా లక్ష్యం
ఓవర్ బర్డెన్ తొలగింపును ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం
సమీక్ష నిర్వహించిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి

ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధిక ఉత్పత్తి సాధించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను వేగవంతం చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ డా. బుద్ధ ప్రకాశ్ జ్యోతి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సింగరేణి భవన్‌లో నైనీ గని పనితీరు, ఉత్పత్తి లక్ష్యాలపై సంస్థ డైరెక్టర్లు, సంబంధిత జనరల్ మేనేజర్లతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నైనీ గని నుంచి ప్రతిరోజూ కనీసం 20 వేల టన్నులకు పైగా బొగ్గును తెలంగాణకు రవాణా చేయాల్సిన ఆవశ్యకత ఉందని సీఎండీ స్పష్టం చేశారు. ఇందుకోసం బొగ్గు వెలికితీత, నిరంతర రవాణా ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

-హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి) 2



అయోధ్యలో దీపావళి వేళ
ప్రపంచ రికార్డు 2

సరయూ తీరంలో 30 లక్షల మట్టి దీపాలతో దీపోత్సవం

అయోధ్యలో దీపావళి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవంబరు 6 వ తేదీన ధన త్రయోదశి నుంచే ఈ వేడుకలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా సరయూ నది తీరంలో మట్టి ప్రమిదలను వెలిగించి దీపోత్సవం నిర్వహించారు. గత పదేళ్ల నుంచి ఇక్కడ ఈ ఉత్సవం కొనసాగుతోంది.

-న్యూఢిల్లీ, నవంబర్ 7 (సింగిడి)

మురసు తుఫాన్ నష్టంపై
సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ నెల 9లోగా పంట నష్టం అంచనాలు పూర్తి
ఉద్యాన పంటల నష్టం అంచనాలు 92 శాతం పూర్తి
తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు
ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ
రైతుబజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.35కే విక్రయం 2



మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ, తక్షణ ఆర్థిక సాయం అందించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

-న్యూఢిల్లీ, నవంబర్ 7 (సింగిడి)

ఉమ్మడి కడప జిల్లాలో
కూటమి ప్రభంజనం



39 జడ్పీటీసీ స్థానాల్లో 23 ఏకగ్రీవం
పోటీ జరిగిన 16 స్థానాల్లో 13 కూటమి ఖాతాలోకి
టీడీపీ 30, భాజపా 3, జనసేన 3 స్థానాల్లో విజయం
పులివెందులలో టీడీపీ అభ్యర్థి భారతికి 1,463 ఓట్ల మెజార్టీ
రాజంపేటలో పోలి సుబ్బారెడ్డికి 17,440 ఓట్ల భారీ ఆధిక్యం 2

వైసీపీకి కంచుకోటగా భావించే ఉమ్మడి కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో భారీ విజయాలు నమోదు చేసింది. మొత్తం 39 జడ్పీటీసీ స్థానాలకు గానూ 23 ఏకగ్రీవమయ్యాయి.

అమరావతి, నవంబర్ 7 (సింగిడి)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు
భారీ దరఖాస్తులు

రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటు నమోదు కోసం మొత్తం 12,69,761 దరఖాస్తులు వచ్చాయి. 2021 ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తులతో పోలిస్తే ఈసారి సంఖ్య పెరిగింది. గ్రాడ్యుయేట్ ఓటర్ల దరఖాస్తుల గడువు నిన్నటితో ముగిసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,99,394 దరఖాస్తులు రాగా వరంగల్-ఖమ్మం-నల్గొండలో 6,70,367 ఫామ్ 18లు అందాయి. 2

-హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి)



ఇరాన్‌పై అమెరికా
మరోసారి దాడి!

ఖైష్మ్ ద్వీపంలోని వైమానిక రక్షణ వ్యవస్థే లక్ష్యంగా దాడులు
నిమిషాల్లోనే ఇరాన్ రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామన్న ట్రంప్
అమెరికా డ్రోన్‌ను కూల్చివేశామన్న ఇరాన్ సైన్యం
మరోవైపు కొనసాగుతున్న ఇరు దేశాల మధ్య చర్చలు
అణు సమాచారం ఇచ్చేవారికి 20 మిలియన్ డాలర్ల బహుమతి 2

ఇరాన్‌పై అమెరికా మరోసారి పరిమిత స్థాయిలో సైనిక దాడులు చేపట్టింది. హార్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ కీలక ద్వీపం ఖైష్మ్‌లో వైమానిక రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.

న్యూఢిల్లీ, నవంబర్ 7 (సింగిడి)

తాగునీటికే ప్రాధాన్యం



ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నాయని.. తెలంగాణలోనూ జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోయాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని.. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

ఈ అంశంపై చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, భూముల వ్యవహారాలపైనా సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డిసెంబర్‌లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. బ్యారేజీ దెబ్బతినడంతో పంపుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్ల నిర్వహణ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరామని.. ఆ విచారణ జరగకుండా అడ్డుకున్నదెవరో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే గ్రావిటీ ద్వారా నల్గొండ ప్రాంతానికి నీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కూడా సాగునీరు అందించవచ్చన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే రైతులకు నీరు అందుతోందని, తుపాకులగూడెం కూడా అక్కడి నుంచే నీటిని తరలిస్తున్నామని వివరించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిని కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మక్తల్-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు ప్రాంత రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కొడంగల్‌కు రావాల్సిన పరిశ్రమలను గతంలో సిరిసిల్లకు తరలించారని బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు తమ ప్రభుత్వం ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని తెలిపారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇవ్వడానికి కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని, హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ప్రజలకు కష్టాలు ఎదురైనప్పుడు ప్రభుత్వం అండగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ప్రకటించారు.

కొడంగల్ పర్యటనలో భాగంగా హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. రాష్ట్రంలో సాగునీటి లభ్యత, రైతుల అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు.

చీకటిపై వెలుగుల విజయం



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ విలువలను అనుసరిస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఉత్సాహంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, సమాజంలో సౌభ్రాతృత్వంతో మెలగాలని సూచించారు. దేశంలో, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగకు సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. రావణుడిపై విజయం సాధించిన అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని గుర్తుచేశారు. ఈ వేడుక రామరాజ్య శుభారంభానికి ప్రతీకగా నిలిచిందన్నారు. చెడు లక్షణాలపై సద్గుణాల విజయం, కష్టాల నుంచి విముక్తి పొంది సుఖసంతోషాలతో కూడిన జీవితం ప్రారంభం కావడాన్ని దీపావళి సూచిస్తుందని తెలిపారు. శుభారంభాల కోసం గణేశుడిని, సంపద, శ్రేయస్సు కోసం మహాలక్ష్మి ని పూజిస్తూ అందరి సంతోషం కోసం ప్రార్థిస్తారని వివరించారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దీపావళి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకటిపై వెలుగుల విజయానికి, చీకటిని పారదోలాలన్న సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. ఏటా ఉత్సాహంగా దీపావళి జరుపుకుంటానని, ఈసారి కూడా సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్లతో కలిసి పండుగ చేసుకోనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను మోదీ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఉపరాష్ట్రపతి అయోధ్యలో నిర్వహించే దీపోత్సవం-2026లో పాల్గొనేందుకు శనివారం అక్కడికి చేరుకున్నారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో పూజలు చేయడంతో పాటు శ్రీరాముడి పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ ఏడాది దీపోత్సవం పదో వార్షికోత్సవం కావడం విశేషం. అయోధ్యలోని 56 ఘాట్లలో 30 నుంచి 33 లక్షల మట్టి దీపాలు వెలిగించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

అయోధ్యలో దీపావళి వేళ ప్రపంచ రికార్డు



ప్రతి ఏటా లక్షలాది దీపాలను వెలిగిస్తూ కొత్త రికార్డులను అయోధ్య దీపోత్సవం నెలకొల్పుతోంది. ఈ ఏడాది 30 లక్షలకుపైగా దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఉప-రాష్ట్రపతి, యూపీ సీఎం తదితరులు పాల్గొన్నారు. అయోధ్యలో వరసుగా పదో ఏడాది కూడా అంగరంగ వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. లక్షలాది దివ్వెల వెలుగులతో అయోధ్య నగరం మెరిసిపోయింది. సరయూ నదీ తీరంలోని 56 ఘాట్లపై 30 లక్షలకు పైగా దీపాలను వెలిగించి, ప్రపంచ రికార్డు నెలకొల్పారు. దీంతో గతేడాది 26 లక్షలకుపైగా వెలిగించిన దీపాల రికార్డును అధిగమించినట్టయ్యింది. రామజన్మభూమి ఆధ్యాత్మిక వైభవాన్ని రెట్టింపు చేస్తూ దేదీప్యమానంగా ఘాట్లు వెలిగిపోతూ భక్తి, సంస్కృతి సంప్రదాయాలను కళ్లకు కట్టేలా అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాయి. వేడుకల్లో భాగంగా లేజర్ షోతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకను తిలకించేందుకు ఘాట్ల వద్దకు వేలాది మంది తరలివచ్చారు. అలాగే, రామాయణంలోని కీలక ఘట్టాలను కళాకారులు నాటకరూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఉప-రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌తో పాటు పలువురు సాధువులు, ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. 'చాలాకాలం తర్వాత ఓ సాధువు రాష్ట్రానికి సీఎం అయ్యారు.. సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ గత 12 ఏళ్లుగా దేశాన్ని అద్భుతంగా నడిపిస్తున్నారు.. అయోధ్య కేవలం స్మార్ట్ లేదా సోలార్ సిటీ మాత్రమే కాదు.. ఇదొక ఆధ్యాత్మిక నగరం.. నేడు రాముడ్ని దర్శనం చేసుకున్న తర్వాత మోదీ, యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఈ రామమందిరం ఇప్పుడు మొత్తం హిందూ ఆత్మగౌరవానికి ఒక చిహ్నంగా నిలిచినం



ఎత్తిపోతల పథకం టెండర్లలో
భారీ అవకతవకలు

టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీ లన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.



ఉమ్మడి కడప జిల్లాలో
కూటమి ప్రభంజనం

మిగిలిన 16 స్థానాలకు 71 మంది అభ్యర్థులు పోటీ పడగా.. 13 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. జిల్లాలో టీడీపీ 30, భాజపా 3, జనసేన 3 జడ్పీటీసీ స్థానాలను దక్కించుకున్నాయి. వైసీపీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ జెండా ఎగిరింది. అక్కడ టీడీపీ అభ్యర్థి భారతి 1,463 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజంపేట మండలంలో టీడీపీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి 17,440 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. లింగాల జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి గెలుపొందారు. ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి ఆధిపత్యం ప్రదర్శించింది. జిల్లాలో 351 ఎంపీటీసీ స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 55 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 30కి పైగా చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. మరికొన్ని స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా.. అక్కడక్కడ వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు భారీ దరఖాస్తులు

గత గ్రాడ్యుయేట్ ఎన్నికలప్పుడు మహబూబ్ నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,76,462 దరఖాస్తులు రాగా వరంగల్-ఖమ్మం-నల్గొండలో 5,63,282 అప్లికేషన్లు వచ్చాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 1,51,596 దరఖాస్తులు రాగా అతితక్కువగా నారాయణ పేట జిల్లాలో 20,087 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 1,41,808, హైదరాబాద్‌లో 1,04,349, వికారాబాద్ జిల్లాలో 40,147, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 45,611, నాగర్‌కర్నూలులో 43,667, వనపర్తి జిల్లాలో 29,155, జోగులాంబ గద్వాల జిల్లా నుంచి 22,974 పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేశారు.

సిద్దిపేట జిల్లాలో అత్యల్ప దరఖాస్తులు

వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 1,14,525 దరఖాస్తులు రాగా సిద్దిపేట జిల్లా నుంచి కేవలం 7,329 అప్లికేషన్లు మాత్రమే అందాయి. సూర్యాపేట జిల్లాలో 73,990, యాదాద్రి భువనగిరిలో 49,789, జనగామ జిల్లాలో 35,418, మహబూబాబాద్‌లో 53,718, వరంగల్ జిల్లాలో 66,957, హనుమకొండలో 68,056, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 17,907, ములుగు జిల్లాలో 15,337, భద్రాద్రి కొత్తగూడెంలో 57,370 దరఖాస్తులు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో నల్గొండ తర్వాత ఖమ్మం జిల్లాలో అధికంగా 1,09,971 ఫామ్ 18లు అందాయి. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

నామినేషన్ల ఆఖరి గడువుదాకా దరఖాస్తు

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,15,350 దరఖాస్తులే ఆమోదం పొందగా వరంగల్-ఖమ్మం-నల్గొండలో 2,33,861 ఓట్లు ఓకే అయ్యాయి. ఈనెల 25న గ్రాడ్యుయేట్ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించి, అదే రోజు నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. ఈ సమయంలోనూ ఓటు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంటుందని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు 30న ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు. అయితే తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఎన్నికల నామినేషన్ల గడువు చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంటుందని సీఈవో వెల్లడించారు.

మురసు తుఫాన్ నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష



దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి 92 శాతం నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. వ్యవసాయ పంటల నష్టాల అంచనా ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. మురసు తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న స్తంభాలను బాగు చేసినట్లు తెలిపారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరకులు అందించినట్లు వెల్లడించారు. ఆదివారం నాటికి పంపిణీని పూర్తిచేస్తామని సీఎంకు తెలిపారు. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యల పైనా చంద్రబాబు ఆరా తీశారు. ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్, గోధుమ పిండి, కందిపప్పు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కే విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. బియ్యం ధరల నియంత్రణకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని కిలో రూ.66కు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, సాధారణ రకం బియ్యాన్ని రూ.47కు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 పలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ.49కు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా.. 1.03 లక్షల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా లీటరు పామాయిల్ రూ.125కు, కిలో కందిపప్పు రూ.100కు, గోధుమ పిండి రూ.25కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించడానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం మూడు రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ నెల 19 నుంచి
ఉచిత చీరల పంపిణీ..

హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 7 (సింగిడి)

రాష్ట్రంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ఈ నెల 19న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజధాని శివార్లలోని మహిళాసంఘాల సభ్యురాళ్లు హాజరుకానున్నారు. 2026 సంవత్సరానికిగాను రాష్ట్రంలో ఉచిత చీరల పంపిణీ పథకానికి ప్రభుత్వం రూ.334 కోట్లను కేటాయించింది. గతంలో పాలపిట్ట రంగు చీరలు ఉండగా.. ఈసారి ఎరుపు జరీ అంచు గల చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. ఏప్రిల్ నుంచే సిరిసిల్లతో పాటు మరో 13 కేంద్రాల్లో చీరల ఉత్పత్తిని ప్రారంభించారు. మొత్తం 95 లక్షల మందికి పంపిణీ చేయడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 65 లక్షల చీరల తయారీ పూర్తయింది. వీటిని ఇప్పటికే జిల్లాలకు చేర్చారు. దాదాపు రెండు నెలల క్రితమే సగానికి పైగా చీరలు సిద్ధమయినా.. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని చీరల పంపిణీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం జరిగిన మంత్రిమండలి దీనికి ఆమోదం తెలిపింది.

ప్రత్యేక యాప్ సిద్ధం

చీరలను తెల్ల రేషన్‌కార్డు గల కుటుంబాల మహిళలకు వారం రోజుల పాటు పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీ కోసం ప్రత్యేకయాప్‌ను సిద్ధం చేశారు. పంపిణీ కేంద్రాలు లేదా ఇళ్ల వద్ద మహిళలు తమ ఆధార్ కార్డులను పంచాయతీ అధికారులకు చూపాలి. యాప్ ద్వారా ఫొటో తీసుకుని, వివరాలు ధ్రువీకరణ అయిన తర్వాత చీరలు పంపిణీ చేస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పంపిణీ బాధ్యతలను అప్పగించింది.

ఇరాన్‌పై అమెరికా
మరోసారి దాడి!

ఇరాన్ ఇటీవల ఏర్పాటు చేసిన చిన్నపాటి విమాన విధ్వంసక వ్యవస్థను తమ దళాలు నిమిషాల వ్యవధిలోనే ధ్వంసం చేశాయని ఆయన తెలిపారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌కు చేరుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రకటించారు. అయితే దాడికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదు. శుక్రవారం ఖేష్మ ద్వీపంలోని సూజా ప్రాంతంలో రెండు క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఈ దాడుల వల్ల జరిగిన నష్టంపై మాత్రం స్పష్టత లేదు. మరోవైపు, తమ వైమానిక రక్షణ దళాలు అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఖేష్మ ద్వీపంపై అడ్డుకుని కూల్చివేసినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఈ వాదనను అమెరికా ధ్రువీకరించలేదు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇటీవలి రోజుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. సోమవారం ఖేష్మ, హెంగమ్ ద్వీపాలతో పాటు బందర్ అబ్బాస్ సమీప ంలోనూ పేలుళ్లు సంభవించాయి. ఆ సమయంలో అమెరికా చేపట్టిన చర్యలను రక్షణాత్మక దాడులుగా పేర్కొంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో సైనిక ఘర్షణలు తలెత్తడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు, ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఆసక్తిగా ఉందని, చర్చల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని చెప్పారు. అయితే ఏ అంశాలపై అంగీకారం కుదిరిందన్న వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ మాత్రం అమెరికా తమపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, ఆంక్షలను తొలగించాలని, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధ నష్టానికి పరిహారం చెల్లించాలని కోరుతోంది. దాడులు నిలిపివేయాలని కూడా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అమెరికా-ఇరాన్ చర్చలు విఫలమయ్యాయంటూ వస్తున్న వార్తలను ఖతార్ తోసిపుచ్చింది. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం అందించే వారికి 20 మిలియన్ డాలర్ల వరకు బహుమతి ఇస్తామని అమెరికా ప్రకటించింది. అణు కేంద్రాలు, పరికరాలు, సంబంధిత వ్యక్తుల వివరాలు అందించిన వారికి ఈ అవకాశం ఉంటుందని తెలిపింది.

నైనీ గని నుంచి బొగ్గు ఉత్పత్తి
పెంపునకు చర్యలు

ఓవర్ బర్డెన్ తొలగింపును గణనీయంగా పెంచితేనే అధిక బొగ్గును ఉత్పత్తి చేయడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. సమీక్షలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. వెంకన్న, జీఎంలు తాడబోయిన శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. బొగ్గు రంగంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల సమర్థ అమలు, నిధుల సద్వినియోగం, సామాజిక ప్రభావ అంచనా అంశాలపై కోల్‌కతాలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) అధికారులు పాల్గొన్నారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఐఐసీఏ, కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 4, 5 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించారు. సింగరేణి తరఫున హైదరాబాద్ కార్యాలయ డీజీఎం (ఐఈ) నిమ్మ భాస్కర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్.ఎం.డి. గౌస్ పాషా హాజరయ్యారు. ఈ వేదికపై సింగరేణి అమలు చేస్తున్న రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం, జస్టిస్ ఆన్ వీల్స్, హరే కృష్ణ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు అల్పాహార పంపిణీ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సురక్షిత తాగునీరు, యువతకు జాబ్ మేళాలు, తేనెటీగల పెంపకం వంటి వినూత్న ఉపాధి కల్పన పథకాలను నిమ్మ భాస్కర్ సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని కోల్ ఇండియా ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రశంసించారు. బొగ్గు గనుల పరిసర ప్రాంత ప్రజల సమగ్ర జీవన ప్రమాణాలు పెంచేలా ఫలితాల ఆధారిత విధానాలతో సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయడమే సంస్థ లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు



సిద్దిపేట,నవంబర్ 7, (సింగిడి):
పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఇబ్రహింనగర్ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా కొంపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు ప్రతిభ చాటనున్నారు. ఎంపికైన వారిలో హరినాథ్ (సీఈసీ ద్వితీయ సం వత్సరం), హర్షవర్ధన్ (బైపీసీ ద్వితీయ సంవత్సరం), అనన్య (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), వైష్ణవి (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), రత్నసిరి (బైపీసీ ద్వితీయ సంవత్సరం), వీరు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు తీర్చిదిద్దిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుండి ప్రవీణ్‌ను ప్రశంసించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి వెలుగులు

జిల్లావ్యాప్తంగా రేపు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు
3,768 ఇళ్లలో పండుగ సంబరాలకు ఏర్పాట్లు పూర్తి.. లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఉమ్మడి నల్గొండ బ్యూరో/కామారెడ్డిప్రతినిధి , నవంబర్ 7:(సింగిడి)
పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో ఈసారి దీపావళి పండుగ ప్రత్యేక శోభను సంతరించుకోనుంది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా నవంబర్ 8వ తేదీ ఆదివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పూర్తయిన 3,768 ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు దీపాలు వెలిగించి పండుగ సంబరాల్లో పాల్గొననున్నారు.జిల్లాకు 16,163 ఇళ్ల మంజూరు..గుడిసెలు లేని కామారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటివ రకు జిల్లాకు 16,163 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 3,768 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, మిగిలిన ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలో లబ్ధిదారులు జరుపు కుంటున్న తొలి దీపావళిని మరింత ఆనందంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద ప్రత్యేక లోగోలు ఏర్పాటు చేయడంతో పాటు లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించనున్నారు. లబ్ధిదారులు తమ ఇళ్ల ముందు ప్రమిదలు వెలిగించి కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకోనున్నారు. వేడుకలకు సంబంధించిన ఫొటోలు, ఆనందకర క్షణాలను ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఇళ్ల నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత తీసిన ఫొటోలతో ప్రత్యేక ప్రదర్శన పలకలను సైతం ఏర్పాటు చేయనున్నారు. గృహ నిర్మాణ శాఖ, మండల పరిషత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించనున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి పండుగ శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. సొంత ఇల్లు సమకూరడంతో వారి జీవితాల్లో వచ్చిన మార్పులు, గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితులపై లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తొలి దీపావళిని ప్రత్యేకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి లబ్ధిదారుడి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొనేలా సం బంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాం తాల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పేద కుటుంబాల ఇళ్లలో దీపావళి వెలుగులు, ఆనందాన్ని నింపాలని సూచించారు.ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు అందడం ఒక మధురమైన అనుభూతి. అలాంటి కుటుంబాలు తమ కొత్త ఇంటి గడప వద్ద తొలి దీపావళి దీపాలు వెలిగించుకోవడం ఈ ఏడాది పండుగకు ప్రత్యేకతగా నిలవనుంది.

యుఏఈలో ఉద్యోగ అవకాశం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి):
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ)లోని నిర్మాణ రంగంలో వివిధ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.యుఏఈ లోని నిర్మాణ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, వాటి వేతన వివరాలను ఆయన వెల్లడించారు. జనరల్ హెల్పర్ పోస్టుకు నెలకు AED 1,050 (సుమారు ₹27,080) వేతనం ఉంటుందని, ఈ పోస్టుకు ఎలాంటి నైపుణ్య పరీక్ష ఉండదని పేర్కొన్నారు. అలాగే షట్టరింగ్ కార్పెంటర్స్, స్టీల్ ఫిక్సర్స్, మేసన్స్ పోస్టులకు నెలకు AED 1,350 (సుమారు ₹34,830) చొప్పున వేతనం అందుతుందని, వర్తించే నిబంధనల ప్రకారం అదనపు బోనస్ కూడా లభిస్తుందని వివరించారు.22 నుంచి 42 సంవత్సరాల వయోపరిమితి కలిగిన పురుష అభ్యర్థులు ఈ



ఉద్యోగాలకు అర్హులని, ఒప్పంద కాలపరిమితి 2 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ తరఫున ఉచిత విమాన టికెట్, ఉచిత వసతి, రోజుకు 3 పూటలా ఉచిత భోజనం మరియు రవాణా సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మిస్డ్ కాల్ నంబర్ 08035524946, కార్యాలయ ఫోన్ నంబర్ 040-23342040 ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in సందర్శించి వివరాలు నమోదు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి సూచించారు.

వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ఉమ్మడి నల్గొండ బ్యూరో : యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీన పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత ఇంటిలో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ సీఈఓలు సంయుక్తంగా హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అధికారులు మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు గోడపై 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' లోగో స్టిక్కర్‌ను అతికించి, లబ్ధిదారుల వివరాలను పెయింటింగ్ చేయాలని సూచించారు.నవంబర్ 8వ తేదీన లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి, అధికారిక ఇందిరమ్మ ఇండ్లు మొబైల్ యాప్ ద్వారా కుటుంబ సభ్యులతో గ్రూప్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో ఫొటోలను పోస్టు చేసే సమయంలో హ్యాష్‌ట్యాగ్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. సొంత ఇంటి కలను సాకారం చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ మరింత ఆనందాన్ని నింపేలా కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు.

అరుణాదేవి సేవలు అభినందనీయం

కరీంనగర్, నవంబర్ 7(సింగిడి)
సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల వసతి గృహ వార్డెన్‌గా అరుణాదేవి 38 ఏళ్ల పాటు అందించిన నిస్వార్థ సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు.నగరంలో నిర్వహించిన అరుణాదేవి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అరుణాదేవి–నరసింహస్వామి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎందరో విద్యార్థుల బాగోగులు చూసుకుంటూ వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భగత్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు తోకల భూమేశ్వర్, వడ్డే శ్రీరామ్ రెడ్డి, చీకోటి గాంధీ, వెంకటేశ్వరరావు, ఎనగందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పారమితలో ముందస్తు దీపావళి వేడుకలు

కరీంనగర్, నవంబర్7(సింగిడి)



స్థానిక పారమిత విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటకాలతో పండుగ ప్రాముఖ్యతను చాటుతూ ఆహుతులను అలరించారు.ఈ సందర్భంగా సంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, దీపావళి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. దీపాలు వెలిగించేటప్పుడు, టపాసులు పేల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు నగర ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగపుత్ర భవనానికి రూ.5 కోట్ల నిధులు

కరీంనగర్, నవంబర్7(సింగిడి)
ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ చేపల మార్కెట్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ మత్స్యకారుల విభాగం ప్రధాన కార్యదర్శి నాగుల సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని విమర్శించారు.కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడప అజయ్, మార్క రాజాగౌడ్, మిరాజ్, భారీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్ జీవితం యువతకు ఆదర్శం

కరీంనగర్, నవంబర్7(సింగిడి)



ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారతరత్న సర్ సీవీ రామన్ జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ప్రముఖ కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సర్ సీవీ రామన్, మేరీ క్యూరీ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామన్ భౌతికశాస్త్రంలో చేసిన పరిశోధనలు, 'రామన్ ప్రభావం' ఆవిష్కరణతో ప్రపంచ గుర్తింపు పొంది నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. మేరీ క్యూరీ భౌతిక, రసాయన శాస్త్రాల్లో పరిశోధనలతో రెండు నోబెల్ బహుమతులు పొందిన తొలి మహిళగా నిలిచారని వివరించారు. డా క్టర్ వనజా నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు ప్రశ్నలకు చురుకుగా సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యగోపాల్, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, అధిక ధరలపై చర్యలు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో
నవంబర్ 7 (సింగిడి)



యాదాద్రి భువనగిరి జిల్లాలో బియ్యం లభ్యత, నిల్వలు మరియు ధరలపై హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో అదనపు కలెక్టరు వెంకా రెడ్డి తేది 07.11.2026 సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్లో వివిధ రకాల బియ్యం లభ్యత, (22) రకాల నిత్యవసర వస్తువుల నిల్వల వివరాలను మరియు ధరలను సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా బియ్యం సరఫరా జరిగేలా వ్యాపారులు తగినంత నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన మేరకు నిల్వలను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవాలని, బియ్యాన్ని న్యాయమైన ధరలకు విక్రయించాలని అదనపు కలెక్టరు గారు సూచించారు. మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమంగా నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమ వ్యాపార పద్ధతులకు పాల్పడరాదని, పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు.అలాగే, వ్యాపార ప్రాంగణాల్లో స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి, వాటిపై బియ్యం రకం, బియ్యం నిల్వల పరిమాణం మరియు కిలోకు విక్రయ ధరలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. స్టాక్ బోర్డులలోని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, నిల్వలు, కొనుగోలు మరియు విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.బియ్యం సరఫరాలో ఏవైనా ఇబ్బందులు లేదా నిల్వల కొరత ఏర్పడినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, మార్కెట్లో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు పౌర సరఫరాల శాఖకు పూర్తి సహకారం అందించాలని వ్యాపారులకు సూచించారు.వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్కెట్లో బియ్యం లభ్యత, నిల్వలు మరియు ధరలను పౌర సరఫరాల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని అదనపు కలెక్టరు గారు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందకుండా, అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు కొరకు 9281423621 టోల్ ఫ్రీ నంబరుకు తెలుపుటకు సూచించారు. ఈ సమావేశంలోజేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి , ఆర్డిఓ భువనగిరి కృష్ణా రెడ్డి విజిలెన్స్ అధికారులు, కమిటీ సభ్యులు, జిల్లా రైస్ మిల్లర్ల అధ్యక్షులు, రేషన్ డీలర్ల అధ్యక్షులు, పెట్రోల్ బంకుల అధ్యక్షులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థాన కార్తికోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 7 (సింగిడి)



యాదగిరిగుట్ట దేవస్థానం కార్తికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్ అండ్ బి , సినిమాటోగ్రఫీ మరియు ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రులను ఆహ్వానం పలికిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవాని శంకర్. శనివారం హైదరాబాద్ లోని ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఆలయ దేవస్థానం ఈవో లతో కలిసి దేవస్థానంలో నిర్వహించే కార్తికోత్సవాల పోస్టర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి,ఎస్సీ, ఎస్టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, ఆలయ దేవస్థానం ఈవో లతో కలిసి దేవస్థానంలో నిర్వహించే కార్తికోత్సవాల పోస్టర్ ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవిష్కరించారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 20, 21, 22 తేదీలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్తీకోత్సవ వేడుకలు.ఈ సందర్భంగా కార్తీకోత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గార్లను కలిసి కార్తీకోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో దీపావళి వేడుకలు

కరీంనగర్, నవంబర్7(సింగిడి)



నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శనివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు దీపాలు వెలిగించి, ధనలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కుటుంబసమేతంగా పండుగను ఆనందంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మొహియుద్దీన్, సహాయ కమిషనర్ రాజ మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాత నేరస్థులపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 07: (సింగిడి)
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్థులపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి వేళల్లో పాత నేరస్థుల వద్దకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో భాగంగా పాత నేరస్థులు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, ఏం చేస్తున్నారు, వారి ప్రస్తుత కార్యకలాపాలు ఏమిటి, ఎవరితో సంబంధాలు కలిగి ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీసి,తిరిగి నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలలో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..జిల్లాలో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో కనీస వేతనాలు తప్పనిసరి!

కామారెడ్డి, నవంబర్ 07:(సింగిడి)
జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ డాక్టర్ ఎం. శశి కుమార్ స్పష్టం చేశారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం ప్రతి సంస్థ యజమాని బాధ్యత అని పేర్కొన్నారు. సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో కామారెడ్డి జి ల్లాలోని దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులకు కనీస వేతనాల చట్టం అమలు, కార్మికుల లైసెన్సుల నమోదు, నవీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి యజమాని తమ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలను తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. తెలంగాణ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం ప్రతి దుకాణం, వాణిజ్య సంస్థ యజమాని తమ సంస్థను సంబంధిత శాఖలో నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన లైసెన్సులను పొందాలని, వాటి గడువు ముగియకముందే సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. కార్మికులకు నిర్ణీత పని గంటలు, వారాంతపు సెలవులు, ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమానులపై ఉందని స్పష్టం చేశారు. హక్కుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ఎడిటోరియల్

Editorial

మౌలిక సదుపాయాల కల్పనే
ప్రపంచ పట్టణ ప్రణాళిక లక్ష్యం
ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా పట్టణ ప్రణాళిక ప్రాముఖ్యతను గుర్తించి, పట్టణాలను స్థిరంగా అభివృద్ధి చేసే దిశగా ప్రతి సంవత్సరం నవంబర్ 8న జరుపు కుంటారు. ఈ రోజు, పట్టణ ప్రణాళికలో పాల్గొనే ప్రణాళిక దారులు, ప్రభుత్వాలు, పౌరులు, పర్యావరణ కార్యకర్తలు వంటి వర్గాలు పట్టణాలను మరింత ఆరోగ్యకరమైన, సుస్థిరమైన, ఆర్థికంగా బలమైన ప్రదేశాలుగా మార్చాలన్న లక్ష్యాన్ని ప్రోత్సహిస్తాయి.

పట్టణ ప్రణాళిక ఒక సమగ్ర, సుస్థిర అభివృద్ధి విధానంగా గుర్తించ బడుతుంది, ఇది పట్టణాలు, నగరాల భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శకత ఇవ్వడమే కాకుండా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో భూమి వినియోగం, రవాణా, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలు ప్రధానంగా ఉంటాయి. సరైన ప్రణాళిక ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, జీవన స్థలాలను అందించవచ్చు.

పట్టణ ప్రణాళిక దారులు అనేక అంశాలను సమన్వయంగా పరిగణలోకి తీసుకుంటారు. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, సౌకర్యాల అభివృద్ధి, రవాణా సౌలభ్యం వంటి విషయాలు పట్టణ ప్రణాళికలో ప్రాధాన్యతను పొందుతాయి.



ప్రపంచ వ్యాప్తంగా పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. దీనికి అనుగుణంగా పట్టణాలను సుస్థిరంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. నిర్దిష్ట ప్రణాళిక ద్వారా నివాస అవసరాలు, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు సమర్థవంతంగా నిర్వహించవచ్చు. దీనివల్ల పట్టణాలు నియంత్రిత మార్గంలో అభివృద్ధి చెందుతాయి.

పట్టణ ప్రణాళిక అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడంలో సహాయ పడుతుంది. సదుపాయాలు, విద్య, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలు అందుబాటులో ఉండేలా చేస్తుంది. సరైన పట్టణ ప్రణాళికతో సామాజిక సమానత్వం పెంపొందించడం సాధ్యమవుతుంది.

పట్టణ ప్రణాళిక పర్యావరణాన్ని రక్షించే విధానాలను ప్రోత్సహిస్తుంది. సరైన ప్రణాళిక ద్వారా ప్రకృతి వనరులను సంరక్షించడం, కాలుష్యాన్ని తగ్గించడం, గ్రీన్ స్పేస్‌ల అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేయవచ్చు. ఇది శాశ్వత వనరుల వినియోగాన్ని పరిమితం చేయడంలో కూడా సహాయ పడుతుంది.

పట్టణ ప్రణాళిక ఆర్థికాభివృద్ధికి పునాది వేస్తుంది. పెట్టుబడులను ఆకర్షించడం, నూతన ఉద్యోగాలను సృష్టించడం, వ్యాపార అభివృద్ధి అవకాశాలను పెంచడం వంటి అంశాలను పట్టణ ప్రణాళికలో పరిగణలోకి తీసుకుంటారు.

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం మన పట్టణాల భవిష్యత్తు గురించి ఆలోచించడానికి, వాటిని మరింత మెరుగైన ప్రదేశాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రయత్నాలు చేయడానికి అన్ని వర్గాలకు విలువైన అవకాశాన్ని ఇస్తుంది. పట్టణ ప్రణాళిక దారులు, ప్రభుత్వాలు, పౌరులు, మరియు సంబంధిత వర్గాలు కలిసి పనిచేస్తే సురక్షితమైన, ఆరోగ్యకరమైన, జీవించడానికి అనువైన పట్టణాలను సాధించడం సాధ్యమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

శాస్త్ర పరిశోధకులకు మార్గ దర్శకుడు
ఎడ్మండ్ హేలీ
నేడు ఎడ్మండ్ హేలీ జయంతి



ఎడ్మండ్ హేలీ పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది ప్రసిద్ధ "హేలీ తోకచుక్క". అయితే, ఆయన కేవలం ఈ తోకచుక్కను గుర్తించిన శాస్త్రవేత్తే కాకుండా, ఖగోళ శాస్త్రం, భూగర్భ శాస్త్రం, వాతావరణ శాస్త్రం, గణిత శాస్త్రం వంటి అనేక రంగాలలో తన విశేష కృషి చేసి, శాస్త్ర పరిశోధనలకు మార్గదర్శకుడిగా నిలిచాడు. ఈయన పరిశోధనలు, అన్వేషణలు శాస్త్ర పరిజ్ఞానంలో బహుళమైన మార్పులు తీసుకువచ్చాయి.

ఎడ్మండ్ హేలీ 1656 నవంబర్ 8న ఇంగ్లాండ్‌లో జన్మించాడు. బాల్యం నుండి ఖగోళ శాస్త్రం పట్ల ఆయనకు ప్రత్యేక ఆసక్తి ఉండేది. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో గణితశాస్త్రం చదివి, ఖగోళ శాస్త్రంపై పట్టు సాధించాడు. 20 ఏళ్ల వయస్సులోనే, ఖగోళ పరిశీలనపై ఆసక్తితో సొంతంగా 24 అడుగుల పొడవుండే టెలిస్కోపును రూపొందించుకుని,

దక్షిణ అట్లాంటిక్ సముద్రంలోని సెయింట్ హెలీనా దీవికి ప్రయాణించి, అక్కడ 341 నక్షత్రాలను పరిశీలించి వాటి స్థానం, ప్రకాశం గురించి సమగ్ర పటాన్ని రూపొందించాడు. ఈ ప్రయోగం అప్పట్లో ఖగోళ పరిశోధనల్లో సరికొత్త అధ్యాయాన్ని తెరిచింది.

ఎడ్మండ్ హేలీ తన సమకాలీన శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ తో సన్నిహితంగా పనిచేసి, శాస్త్రీయ సిద్ధాంతాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాడు. గురుత్వాకర్షణ సూత్రాల పునాది అయిన న్యూటన్ సిద్ధాంతాలను "ప్రిన్సిపియా మ్యాథమెటికా" అనే గ్రంథంలో ప్రచురించడానికి న్యూటన్ మొగ్గ చూపక పోయినా, హేలీ ప్రోత్సాహం, ఆర్థిక సహాయం అందించడంతో న్యూటన్ ఈ గ్రంథాన్ని వెలువరించాడు. న్యూటన్ సిద్ధాంతాలు ప్రచురణ కావడంతో ఖగోళ శాస్త్రం ఒక సుస్థిర మౌలిక శాస్త్రంగా నిలిచింది, దీనికి హేలీని కూడా ప్రధాన కారణంగా పరిగణిస్తారు.

ఎడ్మండ్ హేలీ 1531, 1607 మరియు 1682 సంవత్సరాల్లో భూమికి దగ్గరగా కనిపించిన తోకచుక్కలను గమనించి, ఇవన్నీ ఒకే తోకచుక్క అని అంచనా వేశాడు. ప్రతి 75-76 సంవత్సరాలకు ఈ తోకచుక్క భూమికి సమీపంలోకి వస్తుందని తేల్చాడు. 1758లో ఈ తోకచుక్క మళ్లీ భూమి దగ్గరగా కనిపించడంతో హేలీ అంచనా సత్యమని నిరూపితమైంది. ఆయన పేరుపై ఈ తోకచుక్కను "హేలీ తోకచుక్క"గా పిలుస్తూ ఖగోళ శాస్త్ర చరిత్రలో స్థిరమైన గుర్తింపు పొందింది.

హేలీ భూమి యొక్క అయస్కాంత క్షేత్రాన్ని పరిశోధించాడు, భూభాగాల అయస్కాంత బలం మార్పులను పటాల రూపంలో రూపొందించి, భూమిపై అయస్కాంత ప్రభావాన్ని అధ్యయనం చేశాడు.
సముద్ర ప్రవాహాలు, గాలుల మార్పు వంటి అంశాలను పరిశీలించి, వాతావరణంలో కాలం, రుతువులు, గాలుల ప్రభావం గురించి అధ్యయనం చేశాడు.

ఎడ్మండ్ హేలీ తన జీవితంలో ఖగోళ శాస్త్రం, ఇతర శాస్త్ర రంగాల్లో అనేకానేక పరిశోధనలు చేసి శాస్త్రాభివృద్ధికి కీలకంగా నిలిచాడు. ఆయన కనుగొన్న హేలీ తోకచుక్క ఆయన్ని శాశ్వతంగా ఖగోళ శాస్త్ర చరిత్రలో నిలిపింది. ఖగోళ శాస్త్రం, భూగర్భ శాస్త్రం, గణితం, వాతావరణ శాస్త్రం వంటి విభిన్న రంగాలలో ఆయన చేసిన కృషి, పరిశోధనలు శాస్త్ర ప్రపంచానికి అపూర్వ వరాలు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

అలనాటి మేటి చిత్ర రాజం దీపావళి

దీపావళి అనగానే వెంటనే స్ఫురణకు వచ్చేది ఆరు దశాబ్దాల క్రితం నాటి చిత్ర రాజం. ఈ చలనచిత్రంలో నందమూరి తారక రామారావు, సావిత్రి, కృష్ణకుమారి, ఎస్. వరలక్ష్మి, రమణారెడ్డి, ఎస్వీ రంగారావు, కాంతారావు తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎస్. రజనీకాంత్ దర్శకత్వం వహించగా, 1960లో ఈ సినిమా విడుదలైంది.



కార్తీకమాసం ప్రారంభానికి ముందు వచ్చే ఆశ్వయుజ కృష్ణ అమావాస్య దీపావళి అమావాస్యగా అంతకుముందు రోజు నరకపీడ వదిలిన నరక చతుర్దశి దినంగా జరుపుకుంటాం. దీపావళి పండుగ రావడానికి కారణం నరకవధ ప్రధాన మైనది. నరకుడు విష్ణు భక్తులను పెట్టే బాధలను, శ్రీకృష్ణుడి లీలను చూపుతూ ఈ సినిమా సాగుతుంది. సమయా సమయాలు పాటించక, సమయం కాని సమయంలో సంగమిస్తే, దేవతలకు కూడా దుష్ట స్వభావులైన పిల్లలే పుడతారని దీపావళి సినిమా ద్వారా గ్రహించ వచ్చును. హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహమూర్తి ఆగ్రహం చల్లారకుం డా ఉన్నస్థితిలో వరహామూర్తికి, భూదేవికి పుట్టిన సంతానమే నరకుడు. నరకుడు జన్మించిన సమయంలోనే భూదేవికి, శ్రీమహావిష్ణువు, తన చేతులతో నరకుని వధించనని మాట ఇస్తాడు.

దీపావళి సినిమా ప్రారంభంలో నరకుడు (ఎస్వీ రంగారావు) ఘోర తపస్సుకు మెచ్చి పరమ శివుడు సాక్షాత్కరిస్తాడు. నరకుడు పరమశివుని భక్తితో స్తుతి చేసి, అమరులపై విజయం, మరణం లేకుండా చిరంజీవిగా రెండు వరాలు కోరుతాడు. పరమశివుడు నీ తల్లి తప్ప నిన్ను ఎవరూ వధించలేరని చెప్పి అంతర్ధానం అవుతాడు.

కన్నతల్లి కొడుకుపై కత్తి దూయటం అసంభవం కాబట్టి, తనకు మరణం లేదని భావించిన నరకుడు, తన బలంతో రెచ్చిపోతాడు. దేవేంద్రుని పదవిని బలవంతంగా ఆక్రమిస్తాడు. ఇంకా దేవమాత అయిన అదితి దగ్గర నుండి చెవి కుండలాలు చేజిక్కుంచు కుంటాడు. సాధు జనులను భాదిస్తూ, తాను ఆనందిస్తూ ఉంటాడు. కృష్ణ భక్తులను బాధిస్తూ ఉంటాడు. పేరుకు తగ్గట్టుగానే ప్రజలకు భూలోకంలోనే నరకలోక యాతనలను చూపిస్తాడు.

ద్వారకలో, శ్రీకృష్ణుని (ఎన్టీ.రామారావు) ఆశ్రయంలో ఉన్న నాగదత్తుడి (గుమ్మడి) కూతురు అయిన వసుమతి (ఎస్.వరలక్ష్మి)ని నరకుడు వంచించి తన భార్యగా చేసుకుంటాడు. నారదుని (కాంతారావు) ద్వారా నరకుడి వంచన సత్యభామ (సావిత్రి), శ్రీకృష్ణులకు తెలుస్తుంది. నరకుడిని భర్తగా అంగీకరించిన వసుమతిని, నాగదత్తుడు నరకుని వధించమని చెబుతాడు. దానికి వసుమతి భర్తే తన దైవమని, తాను తన భర్తను చంపలేనని తేల్చి చెప్పడంతో నాగదత్తుడు నిష్క్రమిస్తాడు. కానీ తానే నరకుని చంపబోయి, నరకునికి చిక్కి చెరసాల పాలవుతాడు.

అజేయ బలపరాక్రమాలు కలిగిన నరకుడు తన బలగంతో సాధువులను యజ్ఞయాగాదుల లోని హవిస్సులను తనకే అర్పించాలంటూ, వారిని హింసిస్తూ ఉంటాడు. నరకుడి చావు తన చేతిలో లేకపోవడంతో శ్రీకృష్ణుడు, నారదునితో నరకునికి హితవు చెప్పిస్తాడు. నారదుని హితవుని నరకుడు లెక్కపెట్టడు. ఇంకా రెచ్చిపోయి సాధు జనులను హింసించడం పెంచుతాడు, వారు చేస్తున్న యజ్ఞ యాగాదులను ధ్వంసం చేయిస్తూ ఉంటాడు.

నారదుడి సలహామేరకు వసుమతి తన కొడుకుని, చెరసాలలో ఉన్న తన తండ్రి నాగదత్తుడి దగ్గరకు తీసుకు వెళుతుంది. ఈ విషయం గమనించిన నరకుడు తన కుమారుని వసుమతి దగ్గర నుండి తీసుకుని, వసుమతిని కూడా చెరసాలలో పెడతాడు. ఇంకా నరకుడు శ్రీకృష్ణుని వేషంలో వచ్చి లోకంలో ఉన్న పడచులను అపహరించుకు పోతాడు. ఈ విషయం సత్యభామకు తెలిసి, శ్రీకృష్ణుని నిలదీస్తుంది. కానీ కృష్ణుని మాటలచేత ఆపని కృష్ణుడు చేయలేదని గ్రహిస్తుంది. అయితే ఆపని నరకుడే చేసాడని, నారదునిచేత తెలుసుకున్న సత్యభామ, ఆ నరకుడిని అంతం చేస్తానని నారదుడుకి మాట ఇస్తుంది. ఇక నరకుడు, నాగదత్తుడి కనుగుడ్లు పీకించేస్తాడు. సాధు జనులను హింసించడం కొనసాగిస్తూ ఉంటాడు. శ్రీకృష్ణ సభకు నాగదత్తుడు, అదితి కూడా వచ్చి శ్రీకృష్ణ పరమాత్మతో నరకుని ఆకృత్యాలను మొరపెట్టు కుంటారు. దానితో శ్రీకృష్ణ పరమాత్మ, సత్యభామతో కలిసి నరకునితో యుద్ధానికి వెళతాడు. భూదేవి పుత్రుడైన నరకుడు, భూదేవి అవతారం అయిన సత్యభామ చేతిలో మరణిస్తాడు. నరక బాధలనుండి విముక్తి పొందిన ప్రజలు దీపాలు వెలిగించి, దీపావళి పండుగ చేసుకుంటారు.
వర గర్వితుడై, పీడిత బుద్ధితో ప్రజలను నరకయాతన పెట్టిన దుర్మార్గుడు నరకుడు. అందుకే భగవానుడు కన్నతల్లి చేతుతోనే మరణించేలా చేస్తాడు. లోక పీడితంగా మారితే, ప్రకృతిలోని మాతృ స్వభావం సహించదు, ఊరుకోదు. అలాగే నరకుని ఆకృత్యాలు విన్న సత్యభామ అతనిపై యుద్ధం చేస్తుంది. లోకాన్ని రక్షిస్తుంది.

అలుకా మానవయా జాలి బూనవయా నరకాధీశ్వరా త్రిలోకజీవ పాలా; ఓ దేవా కనలేవా మొర వినవా ఓ దేవా కనలేవా మొర వినవా; కరుణా చూడవయా వరమూ జూపవయా మురళీ మోహనా వినీల మేఘశ్యామా;
కూరిమి గొనుమా ఓ రాజశేఖర కూరిమి తీరక; జయ విజయాభవ గోపాలా ప్రతివీర భయంకర బాహుబలా; యదుమౌళి ప్రియసతి నేనే నాగీటు దాటి చనజాలుదుగా;
సరియా మాతో సమరాన నిలువగలదా; దీనుల పాలీ దైవమందురే మౌనము నీకెల ఓ దేవా లాంటి ఈ సినిమా లోని పాటలు పాతతరం వారికి నిత్య జ్ఞాపకాలే. అలనాటి ఆపాత మధురాలలో దీపావళి తెలుగు పౌరాణిక సినిమా ఒకటి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

తెలుగు సినిమాలలో దీపావళి

సినిమా తెలుగు వారి సంస్కృతిలో, జీవితంలో భాగమైపోయింది. ఏ ఇద్దరు కలుసుకున్నా, ఏ నెట్ గ్రూప్ చూసినా తెలుగు వాళ్ళు సినిమాల గురించి మాట్లాడకుండా ఉండలేరు. తెలుగు వారికి ఇతర సైటుల కంటే సినిమా సైటులే ఎక్కువగా ఉన్నాయి. భారతీయ సినిమాలో సంఖ్యాపరంగా అత్యధికంగానూ, వాణిజ్య పరంగా రెండవ స్థానంలోనూ (ఇంచుమించు తమిళ సినీరంగానికి కుడియెడంగా) తెలుగు సినిమా వర్ధిల్లుతోంది. తెలుగు సినిమా పితామహుడుగా సంబోధించబడే రఘుపతి వెంకయ్య నాయుడు 1909 నుండే తెలుగు సినిమాని ప్రోత్సాహానికై ఆసియా లోని వివిధ ప్రదేశాలకి పయనించి, అనుభవాన్ని గడించి, 1921 లో భీష్మ ప్రతిజ్ఞ అను నిశబ్ద చిత్రాన్ని నిర్మించాడు. దక్షిణ భారతదేశం లోనే ప్రప్రథమమైన ఫిలిం స్టూడియో అయిన దుర్గా సినీటోన్ని నిడమర్తి సూరయ్య రాజమండ్రిలో స్థాపించాడు. జనప్రియమైన నాటకం ఆధారంగా నిర్మించబడిన భక్త ప్రహ్లాద తెలుగులో మొదటి సినిమాగా స్థానం సంపాదించుకొంది. తొలి సంపూర్ణ తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' సినిమా 1932 జనవరి 22న సెన్సార్ జరుపుకొని, 1932 ఫిబ్రవరి 6న బొబాయిలోని కృష్ణా సినిమా థియేటర్ లో విడుదలైంది. సుమారు రెండు నెలల తరువాత, అంటే 1932 ఏప్రిల్ 2న 'భక్త ప్రహ్లాద' మద్రాసులో విడుదలైంది. తరవాత తెలుగు సినిమాలలో ప్రధానంగా పౌరాణిక ఇతివృత్తం గల చిత్రాలే అత్యధికంగా వచ్చాయి.



ఈ సందర్భంగా దీపావళికి ఇచ్చిన ప్రాధాన్యం గుర్తు చేసుకుందాం.

దీపావళి" టైటిల్‌తోఇప్పటికి రెండు తెలుగు సినిమాలు వచ్చాయి. మొదటిది దీపావళి (1960) 'దీపావళి" అంటే ఏమిటీ ఎలా ఆ పురాణ కథ చెప్పేది అయితే మరొకటి... వేణు హీరోగా వచ్చిన దీపావళి (2008) ఓ ఫ్లాప్ సినిమా.
నందమూరి తారక రామారావు – కృష్ణుడు, సావిత్రి – సత్యభామ కృష్ణకుమారి – రుక్మిణి, యస్వీ రంగారావు – నరకుడు, కాంతారావు – నారదుడు, గుమ్మడి – నాగదత్తుడు, ఎస్. వరలక్ష్మి – వసుమతి, నరకుని భార్య, రమణారెడ్డి – శిష్యాసురుడు
ఋష్యేంద్రమణి – దేవమాత అదితి
సుజాత – రంభ ప్రధాన పాత్ర దారులు.

'షావుకారు" (విజయవారి తొలి చిత్రం)లో... దీపావళి పండుగనాడు శాంతమ్మ (శాంతకుమారి) సుబ్బులు (జానకి) ఎంతో ఆత్మీయంగా, ఆనందంగా "దీపావళి, దీపావళి... ఇంటింట ఆనంద దీపావళి... మా యింట మాణిక్యావళి"" అంటూ పాడుతుంది. అలాగే అంతా కలిసి ఉన్నప్పుడు పాడుకునే ఆ పాటని సెకండాఫ్‌లో గొడవలు వచ్చి విడిపోయినప్పుడు "దీపావళి, మా యింట శోకాంధ తిమిరావళి"" అంటూ చూపటం ద్వారా ఓ సింబాలిజంలా వాడుకున్న తీరు మైమరిపిస్తుంది. 'పెళ్లికానుక" సినిమాలోనూ మొదట... 'దీపావళి" పండుగ చేసుకుంటూ ఆనందంగా హీరో హీరోయిన్స్... 'ఆడే పాడే పసివాడా ఆడేనోయి నీ తోడ ఆనందం పొంగేనోయి దీపావళి, ఇంటింట వెలుగు, దీపాల మెరుగు, ఎనలేని వేడుకరా" పాడుకుంటారు. అదే సీన్ రివర్స్ అయినప్పుడు ఆ బాధను స్ఫురింపజేస్తూ... 'ఆడే పాడే పసివాడ, అమ్మాలేని నినుచూడ కన్నీటి కథ ఆయె దీపావళి, ఊరెల్ల వెలుగు, ఆనందం కనరాని దూరమురా" అంటూ రిపీట్ అవుతుంది. దీపావళి అనేది జీవితంలోని వెలుగు నీడలకు ప్రతీక అని దర్శక, రచయితలు తలచారు. విచిత్ర బంధం (1972) చిత్రంలో చీకటి వెలుగుల రంగేళి... జీవితమే ఒక దీపావళి... మన జీవితమే ఒక దీపావళి... అందాల ప్రమిదల ఆనంద జ్యోతుల ఆశల వెలిగించు దీపాలవేళ"" అంటూ సాగే పాట. 'భలే రాముడు" క్లైమాక్స్‌లో సావిత్రి 'ఇంటింటను దీపావళి మా ఇంటను లేదా, ఆ భాగ్యము రాదా" పాట, 'రుణానుబంధం"లోని 'వచ్చింది దీపాల పండుగ ఉన్నోళ్ళ డబ్బంతా దండుగ" పాటలు కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకో తగ్గవే. ఇవన్నీ మనవైన మన పండుగ పాటలు. ఆ తరం నుంచి ముందుకు వస్తే దాసరి నారాయణరావు 'మామగారు' చిత్రంలో 'వెయ్యేళ్ల నిత్యమైన దీపావళి... ఏనాడూ వెళ్లిపోని దీపావళి... ఏరికోరి ఎంచుకుంది మా లోగిలి"" అంటూ ఓ పాట దీపావళి పండుగ నేపథ్యంలో కొత్త అల్లుడుతో ఆనందంగా పాడుకోవటం కనిపిస్తుంది. అలాగే చిరంజీవి 'తాగూర్" ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ (గుర్తొచ్చిందా)లో అపార్టుమెంట్ కూలిపోయే ముందు దీపావళి జరుపుకుంటూ ఓ చిన్న బిట్ సాంగ్ ఉంటుంది. ఇక సూపర్ డూపర్ హిట్ 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి" చిత్రంలోనూ రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, శ్రీకాంత్ కలిసి తమ పెళ్లాల దగ్గర బిల్డప్ ఇవ్వటానికి అప్పుచేసి దీపావళి సామాను తెస్తారు. ఆ తర్వాత ఆ అప్పే వారిని రోడ్డుమీద పారేసేందుకు లీడ్ అవుతుంది. ఇక రెండు మూడేళ్ల క్రితం వచ్చిన కళ్యాణ్‌రామ్... 'విజయదశమి" చిత్రంలోనూ దీపావళిపై పాట వుంటుంది. అయితే పైన చెప్పుకున్న చిత్రాలన్నీ తమిళ రీమేక్‌లే. అక్కడ వారు తమ సంస్కృతిలో భాగమైన దీపావళిని వదలలేదు కాబట్టి మనకూ ఆ మాత్రం దీపావళి సోయగాలన్నా దక్కాయి. సినిమా చూస్తున్న ప్రేక్షకుడుకి ఇది నా కథ, నాకు తెలిసిన వారి కథే. నా జీవితమే అనిపించాలంటే... ఇలాంటి పండుగలను కలపడం వంటి అంశాలు తప్పని కావాలి. కాబట్టి పండగలు, పౌరాణిక పాత్రలు, ఇతివృత్తాలు కూడ వ్యాపార వస్తువులే. అయినా మన తెలుగు హీరో ఇప్పుడు మాఫియో డానో, హిట్ మ్యానో అవుతున్న నేపథ్యంలో ఈ పండుగల నేపథ్య అంశాలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. అయినా ఇలా పండగ సీన్ పెట్టిన సినిమాల వల్ల చూసే జనానికి కూడా కొంత ఔట్సాహికత కలుగొచ్చు.

తెలుగు పరిశ్రమలో విలువలు పాటించకుండా సినిమాలు తీస్తున్న వారు, సినిమా అంటే అవగాహన లేని వారి సినిమాలు వ్యాపార దృక్పదం తో వస్తున్న తరుణంలో, ప్రేక్షకులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించే, భారతీయ సనాతన సాంప్రదాయాలు, సంస్కృతి, సభ్యత నేపథ్యాలను తప్పక ప్రతిబింబించే అంశాలను అంతర్భాగం చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.
ఈ పండుగ పూటనుంచైనా మన దర్శక, నిర్మాతలు... "మనం తెలుగు సినిమాను కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే తీస్తున్నాం" అనే విషయం గుర్తుచేసుకుని ముందుకెళ్తారని, స్క్రిప్టులో మసాలా జోడించి మన పండుగలు, సంప్రదాయాలని కలిపి మనదైన సినిమాని మనకు అందిస్తారని ఆశిద్దాం. పండుగ పూట ప్రార్థిద్దాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
... 9440595494

అమృతకు బండి ఆపన్నహస్తం

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 07 (సింగిడి)

సొంత ఇల్లు లేక స్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన



కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా రికార్డు చేసి, ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భర్తను కోల్పోయిన మహిళలకు 15 రోజుల్లో వితంతు పెన్షన్ అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజావాణిలో అందుతున్న వినతులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించారు. ప్రతి దరఖాస్తుకు రికార్డు ఉండాలిప్రజావాణిలో ప్రధానంగా భూ సమస్యలు, విద్యుత్ స్తంభాలు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన వినతులు వస్తున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. సమస్యలతో



కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజల పట్ల అధికారులు గౌరవంగా, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి వినతిపత్రాన్ని రికార్డు చేసి పరిష్కారానికి తీసుకున్న చర్యలను నమోదు చేయాలన్నారు. సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో తాను స్వయంగా పాల్గొంటానని వెల్లడించారు.

2,728 ఇళ్లలో దీపావళి సంబరాలుదీపావళి సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన 2,728 ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు.173 గ్రామాల అభివృద్ధే లక్ష్యంరాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలుఅలింకో ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమాల షెడ్యూల్ను వెల్లడించారు.– నవంబర్ 16 – సైదాపూర్– నవంబర్ 17 – ఎల్కతుర్తి– నవంబర్ 18 – అక్కన్నపేట– నవంబర్ 19 – భీమదేవర పల్లి– నవంబర్ 20 – కోహెడ– నవంబర్ 25, 26 – హుస్నాబాద్ పట్టణంపృద్ధులు, దివ్యాంగులకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.అలాగే ప్రభుత్వ అవసరాల కోసం స్థల సేకరణకు దరఖాస్తు చేసుకున్నవారికి స్థల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని, జలసిరి, ఆయిల్పామ్ కార్యక్రమాల అమలును సమీక్షించాలని సూచించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమంలో అందిన వినతులను కూడా ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు 5,500 ఇళ్లు

గత పదేళ్లలో పేదలకు ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం జరగడం వల్లే ప్రస్తుతం భారీగా డిమాండ్ ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వ రెండేళ్లలో హుస్నాబాద్ నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.హుస్నాబాద్ పట్టణానికి మొదటి విడతలో 545 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 94 మాత్రమే పూర్తికావడంపై మున్సిపల్ కమిషనర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి వార్డులవారీగా నిర్మాణాల పురోగతిని సమీక్షించాలని సూచించారు. ఇళ్లు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మండలాలవారీగా నిర్మాణాలపై సమీక్షహుస్నాబాద్ పట్టణంలో 545 ఇళ్లకు 94 పూర్తయ్యాయి. హుస్నాబాద్ రూరల్‌లో 240 ఇళ్లకు 89 పూర్తయ్యాయి. అక్కన్నపేటలో 204 ఇళ్ల నిర్మాణాలు మంజూరు కాగా 39 శాతం పూర్తయ్యాయి. చిగురుమామిడిలో 343 ఇళ్లకు 184 పూర్తయ్యాయి. సైదాపూర్‌లో 480 ఇళ్లకు 133, భీమదేవరపల్లిలో 423 ఇళ్లకు 255 పూర్తయ్యాయి. ఎల్కతుర్తిలో మంజూరైన ఇళ్లలో 38 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి.నిర్మాణాలు ప్రారంభించని ఇళ్ల విషయంలో సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. హుస్నాబాద్ రూరల్‌లో 9, అక్కన్నపేటలో 38, చిగురుమామిడిలో 25, సైదాపూర్‌లో 89, భీమదేవరపల్లిలో 9, ఎల్కతుర్తిలో 18 ఇళ్లను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,427 ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, మరో 1,346 ఇళ్లు రూఫ్ లెవల్‌లో ఉన్నాయని తెలిపారు. బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణాలు నిలిపివేసిన లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని, సర్పంచులతో సమావేశాలు నిర్వహించి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.రెండో విడత ఇళ్లకు పది రోజుల్లో ప్రొసీడింగ్సిండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేసి ప్రొసీడింగ్స్ అందించాలని మంత్రి ఆదేశించారు. మండలాలవారీగా మంజూరైన ఇళ్ల వివరాలను వెల్లడించారు.– హుస్నాబాద్ పట్టణం – 96– హుస్నాబాద్ రూరల్ – 86– అక్కన్నపేట – 167– కోహెడ – 192– చిగురుమామిడి – 173– సైదాపూర్ – 159– భీమదేవరపల్లి – 188– ఎల్కతుర్తి – 158గుడిసెల్లో నివసిస్తున్న వారికి, గతంలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నిజమైన అర్హులు, అత్యంత పేద కుటుంబాలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. మొదటి విడతలో ఇల్లు పొందిన కుటుంబాలకు రెండో విడతలో మరో ఇల్లు మంజూరు కాదని, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న కుటుంబాలు, మూడు ఎకరాలకు పైగా భూమి ఉన్నవారు అర్హులు కారని వివరించారు.

నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

కరీంనగర్, నవంబర్7(సింగిడి)

నగర ప్రజల జీవితాల్లో దీపావళి తారాజువ్వల వెలుగుల్లా ఆనందం నిండాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా నగర ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు.పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఆశయాలు నెరవేరి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.





జాతీయ లక్ష్యాలను సాధించాలి

హన్మకొండ ప్రతినిధి నవంబర్ 7(సింగిడి):

జిల్లాలో అన్ని జాతీయ లక్ష్యాలను సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా వైద్య హనుమకొండ జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీ య ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణా రావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మురళి,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోలా రాజేష్ కుమార్, వైద్యాధికారులు, సూపర్ వై సర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ దీపావళి సంబరాల్లో 'పొన్నం'

సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కల ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరుతోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో పొన్నం కోమల–సమ్మయ్య ముదిరాజ్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించిన 'మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులైన కోమల–సమ్మయ్య దంపతులకు నూతన వస్త్రాలు అందించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఇంటి వద్ద బాణసంచా కాల్చి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పండుగ వేడుకలను నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వంలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. రెండో దశలో మంజూరైన ఇళ్లకు సంబంధించి వారం, పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. రూఫ్ లెవల్‌లో ఉన్న లబ్ధిదారులు



సైతం త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, మున్సిపాలిటీలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ సొంతింట్లో ఆనందంగా దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఇందిరమ్మ ఇంట్లో పండుగ చేసుకోవడం ఆనందంగా ఉందిఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు పొన్నం కోమల మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని చెప్పారు. కొత్త ఇంట్లో దీపావళి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి , వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నేడు హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం పర్యటన

హన్మకొండ ప్రతినిధి నవంబర్ 7(సింగిడి):

దీపావళి పండగ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ "మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలు జరుపుకునేందుకు పర్యటనించనున్నారు. ఉదయం 9:00 గంటలకు చిగురు మామిడి మండల కేంద్రంలో 10:30 గంటలకు అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:00 భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలో , మధ్యాహ్నం 1:30 గంటలకు ఎల్కతుర్తి మండల కేంద్రంలో పర్యటనించనున్నారు.

'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' గోడపత్రిక ఆవిష్కరణ

సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే ముందువరుసలో ఉందని తెలిపారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి భగవంత్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం పేరుతో సైబర్ వల!

రూ.1,000 కానుక ఆశ చూపి మోసాలకు తెర.. వాట్సాప్ లింకులతో జాగ్రత్త

హైదరాబాద్, నవంబర్ 7(సింగిడి):

పండుగ వేళ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. పేటీఎం సంస్థ దీపావళి కానుకగా రూ.1,000 నగదు అందిస్తోందంటూ వాట్సాప్‌లో వైరల్ అవుతున్న సందేశాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇలాంటి నకిలీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు.బహుమతి పేరుతో బురిడీపేటీఎం పేరుతో రూపొందించిన నకిలీ సందేశాలను వాట్సాప్ ద్వారా పంపిస్తున్నారు. అందులో ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే రూ.1,000 నగదు బహుమతిగా వస్తుందని నమ్మిస్తున్నారు. అంతేకాకుండా, తాము కూడా లింక్‌పై క్లిక్ చేసి నగదు పొందినట్లు సందేశాలు పంపిస్తూ ఇతరులను ఆకర్షిస్తున్నారు. దీంతో నిజమని నమ్మిన కొందరు ఆ లింకులను తెరిచే ప్రమాదం ఉంది.వ్యక్తిగత వివరాలే లక్ష్యంఇలాంటి అనుమానాస్పద లింకుల ద్వారా వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని సేకరించే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బహుమతుల ఆశతో లింకులపై



క్లిక్ చేస్తే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.అప్రమత్తతే రక్షణతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, పిన్, బ్యాంకు వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని సీపీ సజ్జనార్ సూచించారు. ఏదైనా ఆఫర్ నిజమో కాదో సంబంధిత సంస్థ అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని పోలీసులు కోరుతున్నారు.

ఐఎల్ పిఎ 6వ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

హన్మకొండ ప్రతినిధి నవంబర్ 7(సింగిడి):

హనుమకొండ జిల్లా కేంద్రం 'డి' కన్వెన్షన్ లో ఈ నెల నవంబర్ 14 న జరుగు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ 6వ రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మహబూబాబాద్ వరంగల్ జిల్లా నర్సంపేట కోర్టులలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ నాయకులు, ఐ ఎల్ పి ఎ నాయకులతో కలిసి గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అంబేద్కర్ పిలుపునిచ్చిన 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్యంగా నల్ల కోట్లతో నీలి విప్లవం నినాదంతో ఐ ఎల్ పి ఎ పని చేస్తుందన్నారు. బి.సి మోర్చా జాతీయ అధ్యక్షులు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరుగు సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత హై కోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి హాజరవుతున్నారని, గౌరవ అతిథులుగా వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు వి.బి. నిర్మలా గీతాంబ, ఎం.ఆర్. సునీత లు, పంచాయతీ రాజ్ మంత్రి దనసరి



అనసూయ సీతక్క, వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హాజరవుతున్నారని తెలిపారు.



పెళ్లి పత్రికలు పంచేందుకు వచ్చిన యువతి హత్య

హైదరాబాద్ నుంచి సొంతూరికి రాగా ఘాతుకం.. గాంధారిలో విషాదం

కామారెడ్డి ప్రతినిధి, నవంబర్ 07 (సింగిడి), గాంధారి:

పెళ్లి సందడితో కళకళలాడాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. మరికొద్ది రోజుల్లో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న యువతి దారుణ హత్యకు గురైంది. పెళ్లి పత్రికలు పంచేందుకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఆమె విగతజీవిగా కనిపించడం గాంధారి మండలంలో కలకలం రేపింది.పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలోని అంగడి బజార్ సెల్‌టవర్ సమీపంలో నివాసముండే సిక్కు మతానికి చెందిన ఆర్‌సీ కౌర్ ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటోంది. ఇటీవల ఆమెకు వివాహం నిశ్చయం కావడంతో బంధువులకు పెళ్లి పత్రికలు అందించేందుకు శుక్రవారం స్వగ్రామానికి వచ్చింది.అదే రోజు రాత్రి సెల్‌టవర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు.కారణాలపై ఆరాయువతి హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘాతుకానికి పాల్పడింది ఎవరు? వ్యక్తిగత కక్షలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి నిందితుల ఆచూకీ కోసం విచారణ చేపట్టారు.పెళ్లి పిలుపుల కోసం సంతోషంగా సొంతూరికి వచ్చిన యువతి హత్యకు గురికావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో గాంధారి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఓటరు అర్హులకు మరో సువర్ణావకాశం!

సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అద్భుత అవకాశం కల్పించింది. ఎన్నికలపరమైన పొరపాట్లు సరిదిద్దకపోవడం, గైర్హాజరు , చిరునామా మార్పు , మరణం , డూప్లికేట్ కేటగిరీల కింద జాబితాలో పేర్లు కోల్పోయిన వారు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవడానికి తగిన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటి వద్దకే ఫారాలు.. ఆన్‌లైన్‌లోనూ డౌన్లోడ్!బాధిత ఓటర్లకు అవసరమైన ఫారాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి , అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లేదా బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంచుతారు. ఓటర్లకు ఈ ఫారాలను నేరుగా కానీ, వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కానీ అందజేస్తారు. అలాగే ఓటర్లు వెబ్‌సైట్ ద్వారా తమ నంబర్ నమోదు చేసి కూడా ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు.

నిబంధనలు ఇవే..

అదే చిరునామాలో ఉంటున్న వారు: గతంలో ఎన్ని కలపరమైన ఫారం ఎందుకు సమర్పించలేకపోయారో తగిన కారణాన్ని వివరిస్తూ సంబంధిత డిక్లరేషన్ సమర్పించాలి. చిరునామా మారిన వారు ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాకు సంబంధించిన సరైన ఆధారాలను జత చేయాల్సి ఉంటుంది. పూర్తి చేసిన ఫారాలను స్థానిక అధికారులకు సమర్పించాలి. వారికి మీనహాయింపుఇప్పటికే సర్ ప్రక్రియలో భాగంగా కొత్తగా పేరు నమోదు కోసం ఫాం6 సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకూడదు

ఓటరు జాబితాలో పేర్లు లేనివారికి మరో అవకాశం
నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ
జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం



సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్-2026) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్-2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు మరోసారి ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.నవంబర్ 21 వరకు గడువుఎన్యుమరేషన్ ఫారాలను నవంబర్ 21వ తేదీ వరకు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

ఆరుపదుల వయసులోనూ అలుపెరుగని సైకిల్ ప్రయాణం

డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం..
భీమవరం నుంచి ఢిల్లీకి 3 వేల కిలోమీటర్ల యాత్ర
విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న 62 ఏళ్ల ఇందూరి విజయలక్ష్మి



ఆలేరు, నవంబర్ 7 (సింగిడి):

వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ 62 ఏళ్ల వయసులోనూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఇందూరి విజయలక్ష్మి. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే ధ్యేయంగా భీమవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు సుమారు 3 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో సమాజహితం కోసం ఆమె చేస్తున్న ఈ సాహసోపేత ప్రయాణం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని, ఈ మహమ్మారి నుంచి భావితరాలను కాపాడాలనే సంకల్పంతోనే ఈ యాత్ర చేపట్టినట్లు విజయలక్ష్మి పేర్కొంటున్నారు. సైకిల్ యాత్ర ద్వారా వివిధ ప్రాంతాల్లోని విద్యాసంస్థలను సందర్శిస్తూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలు, భవిష్యత్తుపై చూపే ప్రభావం గురించి విద్యార్థులకు వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ క్రమంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చేరుకున్న విజయలక్ష్మికి యాదగిరిగుట్ట సీఐ శంకర్, ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆమె చేపట్టిన యాత్ర లక్ష్యాన్ని అభినందిస్తూ ప్రోత్సాహం అందించారు. అనంతరం ఆలేరులోని ఎస్ఆర్, వీర్ కళాశాలలను సందర్శించిన విజయలక్ష్మి విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరుపదుల వయసులోనూ వేల కిలోమీటర్ల ప్రయాణానికి సిద్ధమై, సమాజానికి మేలు చేసే సందేశాన్ని చాటుతున్న విజయలక్ష్మి పట్టుదల, సేవాభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆమె చేపట్టిన ఈ యాత్ర విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన 'దరిపల్లి '



పత్తి మార్కెట్ యార్డు అనువైన ప్రదేశం..
ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుపార్కింగ్ కోసం నాలుగు స్థలాల పరిశీలన

సిద్దిపేట, నవంబర్ 7(సింగిడి):

ఈ నెల 19న నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభకు సంబంధించి సిద్దిపేట పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డు స్థలాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, మంద పాండు, నిజాముద్దీన్, మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డి తదితర మండల, మున్సిపల్ నాయకులతో కలిసి సభా స్థలం, పార్కింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ.. పత్తి మార్కెట్ యార్డు అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండే అనువైన ప్రదేశమని తెలిపారు. సిద్దిపేటకు ఈశాన్య దిశలో ఉన్న ఈ ప్రాంతంలో గతంలో అనేక విజయవంతమైన బహిరంగ సభలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.దాదాపు 12 నుంచి 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలానికి కరీంనగర్, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నేరుగా చేరుకునే అవకాశం ఉందన్నారు. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం నాలుగు ప్రదేశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పార్కింగ్ స్థలాలు సభా ప్రాంగణానికి కేవలం కిలోమీటరు దూరంలోనే ఉన్నాయని వెల్లడించారు.వివిధ నియోజకవర్గాలు, మండలాల నుంచి వచ్చే ప్రజలకు విడివిడిగా పార్కింగ్ స్థలాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయవచ్చని వివరించారు. సభా స్థలం, పార్కింగ్‌కు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోదండరావుపల్లి సర్పంచ్ వంగపల్లి అశోక్, బాబు, బింగి యాదగిరి, శ్రీనివాస్, గోపుల పూర్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే పోటీలు

ప్రతిభ చాటిన విద్యార్థులు, పోలీస్ సిబ్బంది

సిద్దిపేట, నవంబర్ 7:(సింగిడి)

పోలీస్ ఫ్లాగ్ డే–2026 సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది తమ సృజనాత్మకతను అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. పోలీస్ శాఖ సేవలు, త్యాగాలు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు.పాఠశాల విద్యార్థుల విభాగంలో విజేతలు– ప్రథమ బహుమతి: బి. భావన (10వ తరగతి, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్, బెజ్జంకి).– ద్వితీయ బహుమతి: బి. దివిజ (8వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్, దౌల్తాబాద్).– తృతీయ బహుమతి: ఎం. ఆదిత్య (10వ తరగతి, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్, బెజ్జంకి).పోలీస్ కానిస్టేబుళ్ల విభాగంలో– ప్రథమ బహుమతి: జి. చిరంజీవి (అక్కన్నపేట పోలీస్ స్టేషన్).– ద్వితీయ బహుమతి: ఎ. రవళిక (బెజ్జంకి పోలీస్ స్టేషన్).– తృతీయ బహుమతి: జి. దివ్య (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సిద్దిపేట).ఎస్ఐ, ఆపై స్థాయి అధికారుల విభాగంలో– పి. రోహిత్ (ఆర్ఎస్ఐ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సిద్దిపేట).– బి. అభిలాష్ (ఆర్ఎస్ఐ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సిద్దిపేట).షార్ట్ ఫిల్మ్ పోటీల్లో– ప్రథమ బహుమతి: వై. సాయి ప్రసాద్ – సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించే వీడియో రూపొందించినందుకు.– ద్వితీయ బహుమతి: ఇ. వీరప్ప – పోలీసుల త్యాగాలు, కఠిన విధి నిర్వహణను వివరిస్తూ వీడియో రూపొందించినందుకు.ఫోటోగ్రఫీ విభాగంలో– ప్రథమ బహుమతి: కే. సతీష్ (సాక్ష్మిఫోటోగ్రాఫర్).ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.





పండ్ల వ్యాపారులకు ఎమ్మెల్యే భరోసా

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి):

వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో డిపో రోడ్డులోని పండ్ల వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం పండ్ల వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, పాత మార్కెట్ యార్డు (పాత గంజి)లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన అనంతరం ప్రస్తుతం వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రాంతంలోనే శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి రోడ్ల విస్తరణ అవసరమని, అదే సమయంలో చిరు వ్యాపారుల జీవనోపాధికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో
మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ములుగు ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి):

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో శనివారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ వ్యవస్థలో మరింత పారదర్శకత, సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్, నాయకులు గడ్డం శ్రీహరి, పల్లె శోభన్, పన్నాల కొండల్ రెడ్డి, గడ్డం పరమేశ్, రాచకొండ సోమయ్య, రేషన్ డీలర్ కవిత, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి

సిద్దిపేట, నవంబర్ 7:(సింగిడి)

సిద్దిపేట జిల్లా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్స్‌సిద్దిపేట అర్బన్: ఆర్టీసీ కార్మికులను కింద కూర్చోబెట్టి అవమానకరంగా మాట్లాడిన సిద్దిపేట డిపో మేనేజర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని సిద్దిపేట జిల్లా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో జరిగిన ఘటనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ కార్మికులను పిలిపించి మాట్లాడే సమయంలో ప్రోటోకాల్ ప్రకారం కోడ్ ఆఫ్ డిసిప్లిన్ సర్క్యులర్ రాలేదని, అందువల్ల కుర్చీల్లో కూర్చోవడానికి వీల్లేదని, నిలబడే మాట్లాడాలని చెప్పడం కార్మికులను అవమానించడమేనని పేర్కొన్నారు.ఈ ఘటన బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను గుర్తు చేస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.డిపో మేనేజర్ అహంకారపూరిత వైఖరిని ఖండిస్తున్నామని, ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించడంతో పాటు కార్మికులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చొప్పరి రవికుమార్ హెచ్చరించారు.



విద్యార్థుల ఫీజు చెల్లించిన కేంద్రమంత్రి బండి సంజయ్

సిద్దిపేట, నవంబర్ 7:(సింగిడి)

1,133 మంది 10వ తరగతి విద్యార్థుల ఫీజును కేంద్ర మంత్రి బండి సంజయ్ చెల్లించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులం దరికీ పరీక్ష ఫీజులు తానే చెల్లిస్తానని ఇటీవల చెప్పిన కేంద్రమంత్రి బండి సంజయ్ మాట నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లాలో ఉన్న హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ,బెజ్జంకి, మద్దూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 1,133 మంది విద్యార్థుల పరీక్ష ఫీజు రూ. 1.37,140 విద్యాశాఖ అధికారి ఖాతకు బదిలీ చేశారు.దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ హైమావతికి శనివారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ బిజెపి నాయకులు రాంగోపాల్, రెడ్డి ఖమ్మం వెంకటేశం తో కలిసి అందజేశారు.

వడ్ల కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవుకొనుగోలు కేంద్రాల్లో ఎల్నినో విపత్తుపై రైతులకు అవగాహన ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

సిద్దిపేట, నవంబర్ 7:(సింగిడి)

రైతుల నుంచి వడ్ల కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, ఎలాంటి జాప్యం చేయకుండా పారదర్శకంగా నిర్వహించాలని మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.చిన్నకోడూరు మండల పరిధిలోని గోనేపల్లి, పెద్దకోడూరు, చిన్నకోడూరు, రామంచ, గంగాపూర్, విఠలాపూర్, రంగయ్యపల్లి, ఎల్లయ్యపల్లి, మాచాపూర్, ఇబ్రహింనగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా ప్రాధాన్యత క్రమంలో సేవలందించాలని సూచించారు. ధాన్యం తూకం విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా ఎల్‌నినో విపత్తు ప్రభావం, దాని వల్ల కలిగే పరిణామాలపై కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు పాకాల భూపతిరెడ్డి, మహ్మద్ సలీం, సమ్మూల్ల వినోద్, బాలలక్ష్మి, అశోక్, అనుపాటి విజయ్ కుమార్, మహిపాల్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, నాగరాజు యాదవ్, తాళ్లపల్లి రాజు, మండల సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చందు, కొమ్ము ప్రశాంత్, గోపు హరిబాబు, పంతం శ్రీనివాస్, కొమ్ము ఎల్లయ్య, కొమ్ము రాజు, మహేందర్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీలు వైకుంఠం, రాజ్ కుమార్, కొమురయ్య, సీఏలు, వీవోఏలు, గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

దమ్మపేట, నవంబర్ 7 (సింగిడి):

దీపావళి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సంత బజార్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ శనివారం ఉదయం సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలను, ప్రభుత్వం జారీ చేసిన లైసెన్సులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్సై బి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రమాదాలకు తావులేకుండా ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా ఇసుక బకెట్లు, తగినంత నీరు మరియు అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విక్రయ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి మందుగుండు సామాగ్రిని పరీక్షించడం లేదా పేల్చడం చేయరాదని స్పష్టం చేశారు. అనుమతి పొందిన స్థలాల్లోనే, నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించి పండుగను ప్రమాదరహితంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.



తొలిసారి సదర్ మహోత్సవం

భీమదేవరపల్లి నవంబర్ 7(సింగిడి):

మండలం లోని ముల్కనూర్ గ్రామ చరిత్రలో తొలిసారిగా నిర్వహించిన సదర్ మహోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకావడంతో మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మంత్రి రాకతో యాదవ సంఘం నాయకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా మంత్రి సదర్ మహోత్సవ వేడుకల్లో పాల్గొని ఉత్సాహాన్ని నింపారు. దున్నపోతుల విన్యాసాలు, వాటి అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలను చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దున్నపోతుల విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ మమతా బాలకృష్ణ, యాదవ సంఘం భీమదేవరపల్లి నాయకులు, సీనియర్ నాయకులు ఉసకోల ప్రకాష్, కొలుగూరి రాజు, ఆధరి రవీందర్, మంగ రామచంద్రం, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, యాదవ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అభ్యాస్ విద్యార్థుల ప్రతిభ

తొర్రూరు, నవంబర్ 7 (సింగిడి):

తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అభ్యాస్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్అ సోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాసాంస్కృతిక పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారని అభ్యాస హై స్కూల్ కరస్పాండెంట్ కేతిరెడ్డి నరేష్ రెడ్డి తెలిపారు.

వ్యవసాయంలో అధిక దిగుబడులే లక్ష్యం

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్ నవంబర్ 7 (సింగిడి) వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు పరిచయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రస్థాయి రైతు మేళాను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడులు సాధించడం, సాగు ఖర్చులు తగ్గించడం, పంటల ఉత్పాదకత పెంచడంపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడమే మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట గ్రామంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహించనున్నారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేళాను ప్రారంభించనుండగా, నాగర్ కర్నూల్ జిల్లా నుంచి ఎంపిక చేసిన 2,500 మంది రైతులు ఈ నెల 9న మేళాకు హాజరుకానున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి వనరుల లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానాలు, పంటల సాంద్రత పెంపు, శాస్త్రీయ సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రంగ నిపుణులు పాల్గొని పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలు, నీటి యాజమాన్యం, నేల ఆరోగ్యం, మట్టి నమూనాల పరీక్షలు, యాంత్రీకరణ ప్రాధాన్యత తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందించనున్నారు.

రైతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు..

జిల్లా నుంచి వెళ్లే 2,500 మంది రైతుల ప్రయాణ సౌకర్యార్థం 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో బస్సులో 50 మంది రైతులు ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రతి బస్సుకు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నోడల్ అధికారిగా నియమించడంతో పాటు, భద్రత కోసం ఒక పోలీసు అధికారిని, సహాయ సహకారాల కోసం ఒక మహిళా సంఘం సభ్యురాలిని అందుబాటులో ఉంచనున్నారు. రైతుల హాజరు, ప్రయాణం, మేళా సందర్శన, తిరుగు ప్రయాణం వరకు వీరు పర్యవేక్షించనున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణ సమయంలో అల్పాహారం, మేళా సందర్శన సందర్భంగా మధ్యాహ్న భోజనం, తిరుగు ప్రయాణంలో రాత్రి భోజనం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు.

ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలి

నేటి పరిస్థితుల్లో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, భూసారాన్ని కాపాడుకోవడం, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతు మేళాలో శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలను తమ భూముల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆచరణలో పెట్టాలని సూచించారు. మేళాలో పొందిన విజ్ఞానాన్ని తమ గ్రామాలకు, వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లి ఇతర రైతులకు కూడా వివరించాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, ఉత్పాదకత పెంచడం, సాగు ఖర్చులను నియంత్రించడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రీన్ దీపావళి



భీమదేవరపల్లి నవంబర్ 7 (సింగిడి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా.. కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలనే సందేశంతో మండలం లోని ముల్కనూర్‌లో గల ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ముందస్తు గ్రీన్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాణసంచాకు దూరంగా ఉంటూ దీపాల వెలుగుల్లో పండుగను ఆనందంగా జరుపుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ.. దీపావళి అంటే వెలుగుల పండుగ అని, పర్యావరణానికి హాని కలిగించే బాణసంచా వినియోగాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. బాణసంచా వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణంలో బాలింతలకు ఊరట..



నాగర్‌కర్నూల్ నవంబర్ 7 (సింగిడి) ప్రయాణ సమయంలో బాలింతలు తమ చిన్నారులకు తల్లిపాలు అందించేందుకు ఇకపై ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. తల్లులు, శిశువులకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో నాగర్‌కర్నూల్ బస్టాండ్‌తో పాటు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పాలిచ్చే కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్, కలెక్టరేట్, ప్రభుత్వ ఆసుపత్రులకు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా చిన్నపిల్లలతో ప్రయాణించే బాలింతలు తమ శిశువులకు తల్లిపాలు అందించేందుకు సరైన వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు ప్రత్యేక పాలిచ్చే కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కేంద్రాల ద్వారా బాలింతలు బహిరంగ ప్రదేశాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, అసౌకర్యాలకు దూరంగా తమ చిన్నారులకు ప్రశాంతంగా తల్లిపాలు అందించవచ్చు. మహిళలు, శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఈ సదుపాయాన్ని కల్పించడం అభినందనీయమని కలెక్టర్, ఎమ్మెల్యే పేర్కొన్నారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని, ప్రతి తల్లికి తన బిడ్డకు పాలు అందించేందుకు అనుకూలమైన వాతావరణం ఉండాలని వారు తెలిపారు. ప్రజా రవాణా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి ఇబ్బందులను తగ్గించవచ్చన్నారు. ఈ కేంద్రాలను బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి పాండు, ఆర్టీసీ డీఎం యాదగిరి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది.

శరవేగంగా చెరువుల పునరుద్ధరణ

- **దమ్మపేట మండలంలో రూ. 1.44 కోట్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె**
- **ఎఫ్‌డీఆర్ నిధులతో నాలుగు చెరువుల మరమ్మతులు**



దమ్మపేట, నవంబర్ 7(సింగిడి)
మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అశ్వారావుపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసింది. తుఫాన్ ధాటికి నియోజకవర్గంలోని పలు చెరువులకు గండ్లు పడటంతో సాగునీరు వృథాగా పోయి, రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ నేపథ్యంలో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎఫ్‌డీఆర్ కింద ప్రత్యేక నిధులను కేటాయించింది. శనివారం దమ్మపేట మండల పరిధిలోని నాలుగు ప్రధాన చెరువుల శాశ్వత, తాత్కాలిక మరమ్మతు పనులకు అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.
తుఫాన్ నష్టంపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో శరవేగంగా నిధులు మంజూరయ్యాయి. దమ్మపేట మండలంలో మొత్తం రూ. 1,44,80,000 కోట్లకు పైగా వ్యయంతో ఈ నాలుగు చెరువుల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా నాగుపల్లి గ్రామంలోని ముసలి బంధం చెరువు శాశ్వత మరమ్మతులకు రూ. 49.80 లక్షలు, దమ్మపేట మండల కేంద్రంలోని పేరంటాల చెరువు మరమ్మతులకు రూ. 47.00 లక్షలు, ఆసన్నగూడెం గ్రామంలోని రంగన్న కుంట శాశ్వత మరమ్మతులకు రూ. 39.50 లక్షలు, అలాగే రాంజీ కుంట అత్యవసర మరమ్మతుల నిమిత్తం రూ. 8.50 లక్షలను ప్రభుత్వం కేటాయించింది.
★రైతు పక్షపాతి మన ప్రభుత్వం
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. విపత్తు సమయాల్లో రైతులకు అండగా నిలవడమే తమ ప్రభుత్వధ్యేయమన్నారు. తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన చెరువులకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే నిధులు విడుదల చేశారని కొనియాడారు. ప్రజల, రైతుల సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న చొరవకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరఫున సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డాలో మిల్క్ బూత్ వద్దు



జోనల్ కమిషనర్ కి సీపీఎం నాయకులు వినతి

మల్కాజిగిరి, నవంబర్ 7 (సింగిడి): మల్కాజిగిరి లోని లేబర్ అడ్డాలో నేరేడ్ మెట్ వ్యక్తులకు మున్సిపల్ అధికారులు ఎలాంటి పూర్వాపరాలు ఆలోఛించకుండా పర్మిషన్ ఇచ్చారు. అడ్డాలో ఉన్న కొద్దిపాటి స్థలం లాక్కునే ప్రయత్నం చేయడం సహించరానిధని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కృపా సాగర్ విమర్శించారు. మల్కాజిగిరి లేబర్ అడ్డాలో మిల్క్ బోర్డు పెట్టొద్దని శనివారం సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మల్కాజిగిరి జోనల్ మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృపా సాగర్ మాట్లాడుతూ ప్రధానంగా బూత్ కు పర్మిషన్ ఇచ్చిన వ్యక్తి నివాసం నేరెడ్ మెట్ స్థానికులు కారని, ఈ అడ్డా దాదాపు 50 సంవత్సరాల నుండి ఉన్నదని, రోజు 150 నుండి 200 ల మంది లేబర్ ఈ అడ్డాకు వస్తారన్నారు. ఈ అడ్డా గురించి మల్కాజిగిరి కాంట్రాక్టర్లకు, మేస్త్రీ లకు, ప్రజలందరికీ తెలుసని, లేబర్ అవసరం ఉంటే నేరుగా ఇక్కడ నుండే తీసుకెళ్తారని గుర్తు చేశారు. ఈ లేబర్ అడ్డాలో మెడికల్ క్యాంపులు, లేబర్ కమిషనర్ వాళ్ళ కార్డ్స్ ఇవ్వడం, మేడే వేడుకలు, అన్నదానాలు, జనరల్ బాడీ మీటింగు లు ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహించి బడుతాయని, అడ్డా కు నలు దిక్కుల వాహనాలు, షాపులు ఉన్నాయని, అడ్డా కూలీలు నిలబడటానికి అందరికీ సరిపడా స్థలం కూడా లేదు. ఉన్న కొద్దిపాటి స్థలంలో మిల్క్ భూత్ పెట్టడానికి అధికారులు ఎలా పర్మిషన్ ఇస్తారు? లేబర్ అంటే అంత చులకన అని సీపీఎం పార్టీ గా తీవ్రంగా ఖండిస్తున్నాన్నారు. లేబర్ అడ్డాల్లో లేబరుకు రేకుల షెడ్స్ వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులకు ఉన్నది. కాని కూలీల పట్ల చులకనా భావం ప్రదర్శిస్తూ, పైగా ఉన్న కొద్దిపాటి స్థలం లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు.
ఈ విధానాలను సీపీఎం పార్టీ ఖచ్చితంగా వ్యతిరేకిస్తూ, ఎలాంటి ఉద్యమాలైన కూలీల పక్షాన చేయడానికి వెనుకాడేది లేదని హెచ్చరిక చేశారు.
బూత్ కు మేము వ్యతిరేకం కాదని, కాని అదే ప్లేస్ లో పెడతాం అంటే ఒప్పుకోమన్నారు. పార్టీ విన్నపాన్ని స్వీకరించాలని, దీన్ని రాజకీయం చేయొద్దు. కూలీలకు అన్యాయం చేయొద్దని కోరుతున్నాం. మా విన్నపాన్ని పెడ చెవిన పెడితే మేము అడ్డుకునేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు కొండల్, విజయ్, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మికులు యాదగిరి, అంజయ్య, సాయిలు, వెంకటేష్, బాలకృష్ణ, తిరుపతి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



మూడువేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర

ఆలేరు, నవంబర్ 7(సింగిడి): వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ 62 ఏళ్ల వయసులోనూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఇందూరి విజయలక్ష్మి. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే ధ్యేయంగా భీమవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు సుమారు 3 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో సమాజ హితం కోసం ఆమె చేస్తున్న ఈ సాహసోపేత ప్రయాణం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని, ఈ మహమ్మారి నుంచి భావితరాలను కాపాడాలనే సంకల్పంతోనే ఈ యాత్ర చేపట్టినట్లు విజయలక్ష్మి పేర్కొంటున్నారు.
సైకిల్ యాత్ర ద్వారా వివిధ ప్రాంతాల్లోని విద్యా సంస్థలను సందర్శిస్తూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలు, భవిష్యత్తుపై చూపే ప్రభావం గురించి విద్యార్థులకు వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ క్రమంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చేరుకున్న విజయలక్ష్మికి యాదగిరిగుట్ట సీఐ శంకర్, ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆమె చేపట్టిన యాత్ర లక్ష్యాన్ని అభినందిస్తూ ప్రోత్సాహం అందించారు. అనంతరం ఆలేరులోని ఎస్ఆర్, వీర్ కళాశాలలను సందర్శించిన విజయలక్ష్మి విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఆరుపదుల వయసులోనూ వేల కిలోమీటర్ల ప్రయాణానికి సిద్ధమై, సమాజానికి మేలు చేసే సందేశాన్ని చాటుతున్న విజయలక్ష్మి పట్టుదల, సేవాభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆమె చేపట్టిన ఈ యాత్ర విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

నూతన నియామకం

తొర్రూరు, నవంబర్ 7(సింగిడి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని దుబ్బ తండ గ్రామ పంచాయతీ పరిధిలోని భీముడు తండాకు చెందిన జాటోత్ సురేష్ నాయక్ సేవాలాల్ సేన తొర్రూరు మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకుజిల్లా అధ్యక్షులు గుగులోత్ నందులాల్ నాయక్ రాష్ట్ర వర్కింగ్గ్రె సిడెంట్ వెంకన్న నాయక్, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్నినిలబెట్టుకుంటానని సురేష్ నాయక్ వెల్లడించారు.

చెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ

నేలకొండపల్లి నవంబర్:07(సింగిడి)
నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువును నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ (సీఈ) వాసంతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, చెరువుకు అనుబంధంగా ఉన్న కాలువలు, రెగ్యులేటర్ పరిస్థితిపై సంబంధిత అధికారులతో కలిసి వివరాలు సేకరించారు. చెరువు నిర్వహణ, నీటి నిల్వల సంరక్షణ, సాగునీటి సరఫరాకు సంబంధించిన పలు అంశాలను ఆమె పరిశీలించారు.
చెరువుమాధారం చెరువుకు అనుబంధంగా ఉన్న దేవినేని వెంకటరమణ (డీవీఆర్) కాలువ రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడంతో నీరు వృథాగా పోతున్న సమస్యపై ఇటీవల పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఈ వాసంతి స్వయంగా రెగ్యులేటర్‌ను పరిశీలించి, దాని ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులేటర్ దెబ్బతినడం వల్ల నీటి నిల్వలు, సాగునీటి సరఫరాపై ప్రభావం పడుతున్న అంశాన్ని పరిశీలించారు. ప్రస్తుత రెగ్యులేటర్ స్థానంలో నూతన రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను సీఈ ఆదేశించారు. రెగ్యులేటర్ నిర్మాణంతో పాటు కాలువ పటిష్టతకు అవసరమైన పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చారు. ఈ పనుల నిమిత్తం కలిపి సుమారు రూ.2.70 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిపాదిత పనులు పూర్తయితే నీటి వృథాను అరికట్టడంతో పాటు కాలువ నిర్వహణ మరింత మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.
అనంతరం మంగాపురంతండాలో ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జిని సీఈ వాసంతి పరిశీలించారు. నూతన బ్రిడ్జి మంజూరు చేయాలని సర్పంచ్ అశోకరాణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి సీఈకు వినతిపత్రం అందజేశారు.

తండాలో కల్తీ మద్యం పట్టివేత



నేలకొండపల్లి, నవంబర్:07(సింగిడి) ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని మంగాపురం తండాలో అక్రమ మద్యం సరఫరా వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. కోదాడ కేంద్రంగా అనధికారికంగా మద్యం సరఫరా అవుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో పోలిస్తే సగానికి సగం తక్కువ ధరకే విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. ఈ అక్రమ మద్యం వ్యాపారంపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయి ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమై, పక్కా సమాచారంతో నిఘా ఏర్పాటు చేసి శనివారం రాత్రి మెరుపుదాడులు నిర్వహించినట్లు సమాచారం.
అక్రమ మద్యం సరఫరా వ్యవహారానికి సంబంధించి అనుమానితులుగా భావిస్తున్న ధీరావత్ కవిత, హరి ప్రసాద్‌కు సంబంధించిన ప్రదేశాల్లో ఎక్సైజ్ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. మొదటగా హరి ప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ శివారులోని దుకాణంపై అధికారులు దాడి చేశారు. అక్కడ తనిఖీ చేయగా మద్యం బాటిల్ లభించిందని, అయితే దానిపై ఉండాల్సిన లేబుల్ లేకపోవడంతో అధికారులు అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై హరి ప్రసాద్ నుంచి సరైన వివరణ లభించకపోవడంతో అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. అనంతరం హరి ప్రసాద్‌ను వెంటబెట్టుకుని సమీపంలోని ఇస్లావత్ నెహ్రూ నివాసంలో తనిఖీలు నిర్వహించగా, అక్కడ బ్యాగుల్లో నిల్వ ఉంచిన వివిధ రకాల అనుమానాస్పద మద్యం సీసాలు బయటపడినట్లు సమాచారం. దీంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి మండల కేంద్రానికి తరలించినట్లు తెలిసింది.
ఈ దాడుల్లో ఖమ్మం జిల్లా స్థాయి ఎక్సైజ్ అధికారులు, మహిళా అధికారులు సైతం పాల్గొన్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న మద్యం నమూనాల నాణ్యత, మూలాలు, సరఫరా మార్గాలపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.
హరి ప్రసాద్, కవితలపై కేసు నమోదు!
ఈ వ్యవహారంలో భాగంగా హరి ప్రసాద్, ధీరావత్ కవితలను శనివారం నేలకొండపల్లి మండల ఎక్సైజ్ కార్యాలయానికి పిలిపించి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించినట్లు సమాచారం. అయితే ఈ అక్రమ మద్యం వ్యాపారం వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? ఎక్కడి నుంచి మద్యం సరఫరా అవుతోంది? ఈ వ్యాపారానికి ఆర్థికంగా సహకరిస్తున్నవారు ఎవరు? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది.
సగం ధరకు మద్యం ఎలా వస్తోంది?
ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే సగానికి సగం తక్కువ ధరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారా? ఇతర జిల్లాల నుంచి అక్రమ రవాణా జరుగుతోందా? అసలు మద్యం బాటిళ్లలో కల్తీ పదార్థాలు కలుపుతున్నారా? లేక నకిలీ లేబుళ్లతో మద్యం విక్రయిస్తున్నారా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు రాబట్టాల్సిన అవసరం ఉంది.
ఈ అక్రమ సరఫరా వ్యవస్థలో కేవలం స్థానికంగా విక్రయిస్తున్న వ్యక్తులపైనే కాకుండా, సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలు, రవాణా మార్గాలు, నిల్వ కేంద్రాలపైనా సమగ్ర విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు.
అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?
ఒకవైపు గ్రామాల్లో అక్రమ మద్యం ఏరులై పారుతోందని ప్రజలు ఆరోపిస్తుంటే, మరోవైపు ఇంతకాలం ఈ వ్యవహారం అధికారుల దృష్టికి ఎందుకు రాలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
నేలకొండపల్లి మండల పరిధిలో ఇంత పెద్ద ఎత్తున అక్రమ మద్యం సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా, స్థానిక ఎక్సైజ్ అధికారులు ముందుగానే ఎందుకు గుర్తించలేకపోయారు? గ్రామాలు, తండాల్లో నిరంతర తనిఖీలు ఎందుకు నిర్వహించలేదు? అక్రమ మద్యం వ్యాపారంపై ముందుగా ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూసార పరీక్షలతో నాణ్యమైన దిగుబడులు

మండల వ్యవసాయ అధికారిణి పూర్ణిమ



కాటారం, నవంబర్ 07(సింగిడి): విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై మండల వ్యవసాయ అధికారిణి పూర్ణిమ రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాగు పద్ధతులను పాటిస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. మండలంలోని రేగులగూడెం రైతు వేదికలో ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం బడి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. నాణ్యమైన దిగుబడుల సాధనకు విత్తన శుద్ధి చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సరైన పద్ధతిలో సేకరించే విధానాన్ని వివరించారు. పంటలను ఆశించే చీడపీడలు, పురుగుల నివారణకు తక్కువ ఖర్చుతో కూడిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాగె ఆమని సురేష్, ఉపసర్పంచ్ వెంకటస్వామి, శాస్త్రవేత్తలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి



తొర్రూరు, నవంబర్ 7 (సింగిడి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సన్నబియ్యాన్ని విక్రయించాలని, నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తునికల, కొలతల జిల్లా ఇన్చార్జి అధికారి కె.విశ్వేశ్వర్ అన్నారు. పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో సుమారు 10 వివిధ బియ్యం షాపు,నిత్యవసర సరుకుల దుకాణాలను తనిఖీ చేశారు.పలు దుకాణాల్లో సన్న బియ్యం అధిక ధరలకు అమ్ముతున్నట్లుగా గుర్తించారు. బస్తాపై 26 కిలోలు ముద్రించి ఉండగా తూకం వేయగా 24 కిలోలే కనిపించింది. రెండు షాపుల యాజమాన్యాలపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో సాకుతో పాత సరుకులను కొత్త ధరలకు విక్రయించడం, ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరపడం నేరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి సరకులను విక్రయిస్తే చర్యలు తప్పవని, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు నిత్యావసర సరకులను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఐసి చైర్మన్ వింజమూరి సుధాకర్,జిల్లా పౌరాసరపరాల అధికారి జాటోత్ రమేష్ నాయక్, సివిల్ సప్లై స్టేట్ టాస్క్ ఫోర్స్ సీఐ జె.వసంత్ కుమార్ తదితరులున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో యువకుడి సత్తా



తొర్రూరు, నవంబర్ 7(నినాదం న్యూస్): గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి పరిశోధనా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వశపాక అనిల్‌కు అరుదైన గౌరవం దక్కింది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వశపాక కుమారస్వామి, వినోద దంపతుల రెండో కుమారుడైన అనిల్, వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ–2026 సదస్సులో ఏఐజీ ఆసుపత్రి తరఫున ఇన్వెస్టిగేటర్ అవార్డు ప్రజెంటేషన్‌కు ఎంపికై ప్రథమ బహుమతి సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి గ్రామానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చిన అనిల్‌ను పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా తిరుమలాయపల్లిలోని అనిల్ నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనిల్ సాధించిన విజయం గ్రామీణ ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి పరిశోధనా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆమ్య నాయక్, ముద్రబోయిన వెంకన్న, కృష్ణారెడ్డి, వశపాక కుమారస్వామి, ఎల్లయ్య, ప్రవీణ్, రామ్లాల్, వినయ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొని అనిల్‌ను అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కల్వకుర్తి నవంబర్ 07 (సింగిడి) అఖిల భారత యాదవ మహాసభ కల్వకుర్తి తాలూకా నూతన కార్యవర్గంతో పాటు వివిధ మండలాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. రాష్ట్ర యాదవ సంఘం పర్యవేక్షణలో రాష్ట్ర కార్యదర్శి రవీందర్ యాదవ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లాలు యాదవ్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి తాలూకా అధ్యక్షుడిగా జక్కుల జంగయ్య యాదవ్‌ను, గౌరవాధ్యక్షుడిగా వంగూరు మండలానికి చెందిన యాదవ్‌ను ఎన్నుకున్నారు.అలాగే వివిధ మండలాల అధ్యక్షులుగా వంగూరు మండల అధ్యక్షుడు సౌధమపల్లి పుల్లయ్య యాదవ్, వెల్దండ మండల అధ్యక్షుడు తానేష్ యాదవ్, కల్వకుర్తి మండల అధ్యక్షుడు లింగం తిరుపతి యాదవ్, ఊరుకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు యాదవ సంఘం అభివృద్ధికి, యాదవుల ఐక్యతకు కృషి చేయాలని నాయకులు సూచించారు. సమాజంలోని ప్రజలను సంఘటితం చేస్తూ, యాదవుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, యాదవ సంఘం నాయకులు పెద్ద యాదవ్, అక్కయ్య యాదవ్, సుధీర్ యాదవ్, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుపై అవగాహన

*** కొత్తకొండలో రావెప్ విద్యార్థుల రైతు సదస్సు..**

*** వ్యవసాయ నమూనాల ప్రదర్శన**



భీమదేవరపల్లి నవంబర్ 7 (సింగిడి): మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న సాగు ఖర్చుల నేపథ్యంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే మెళకువలను రైతులకు వివరించేందుకు వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ క్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన చివరి సంవత్సరం రావెప్ విద్యార్థుల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని బీఆర్‌కే గార్డెన్‌లో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీఆర్‌వీకే) హనుమకొండ, జనగామ, ములుగు కోఆర్డినేటర్లు డాక్టర్ ఈ. నరసయ్య, డాక్టర్ విశ్వతేజ, డాక్టర్ పి. లక్ష్మణ్ అధ్యక్షత వహించి పర్యవేక్షించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

సదస్సులో భాగంగా విద్యార్థులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, సమగ్ర తెగుళ్ల నివారణ, ఎరువుల సమతుల్య వినియోగం, నీటి సంరక్షణ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అంశాలపై నమూనాలు, ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేశారు. రైతులకు వాటి పనితీరును వివరిస్తూ సాగులో అనుసరించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ వి. రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. రావెప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో మమేకమై క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తలకు, రైతులకు మధ్య విద్యార్థులు వారధిగా నిలిచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

టీఆర్‌వీకే కోఆర్డినేటర్లు, వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించే పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి వ్యవసాయ అధికారి పద్మ,కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రావెప్ విద్యార్థులు, కొత్తకొండతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నవంబర్20లోగా పాఠశాల పనులు పూర్తి చేయాలని ఆదేశం



హుజూర్‌నగర్, నవంబర్ 7 (సింగిడి): హుజూర్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం సందర్శించారు. పాఠశాల అభివృద్ధి పనుల కోసం తదుపరి తరం సూర్యాపేట కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో చేపడుతున్న పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులు, ప్రధాన మరమ్మతులు, చిన్నచిన్న మరమ్మతుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆటస్థలాన్ని చదును చేసి బేస్‌బాల్, వాలీబాల్ క్రీడలకు అనువైన మైదానాలను సిద్ధం చేయాలని సూచించారు. కంప్యూటర్ ప్రయోగశాలను పరిశీలించి, దాని నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన అన్ని అభివృద్ధి పనులను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

విద్యార్థులను ప్రశ్నలడిగి..

అనంతరం తొమ్మిదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడుగుతూ, విద్యార్థులతో సమాధానాలు చెప్పించారు. విద్యార్థుల నుంచి వచ్చిన సమాధానాలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాడి నర్సిరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్, డీఈ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే



కొడంగల్, నవంబర్,07(సింగిడి) కోస్గి మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటన ర సింహులు మాట్లాడుతు లేని వారి ఇళ్లను కూల్చి, ఉన్నవారి ఇళ్లను అలాగే పదిలేసిన పరిస్థితి కోస్గి మున్సిపాలిటీలో కనిపిస్తోందని బిఆర్ ఎస్ నాయకులు వెంకట్ నర్సింహులు అన్నారు.. సీఎం సొంత నియోజకవర్గంలోని కోస్గి మున్సిపాలిటీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యాయన్నారు

మరో నెల గడిస్తే మూడేళ్లు పూర్తవుతాయి. కానీ ఇప్పటివరకు ప్రజలకు కనిపించే అభివృద్ధి ఎక్కడా లేదు. రోడ్లు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? మూడేళ్లు కావస్తున్నా కోస్గి ప్రజలకు మీరు చూపించిన అభివృద్ధి ఏమిటి?

ముఖ్యమంత్రి గారు.. సభలకు వచ్చి మైకుల ముందు గప్పాలు కొట్టి వెళ్లడం కాదు.. కోస్గి ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలకు సమాధానం చెప్పండి. మాటలు కాదు.. చేతల్లో అభివృద్ధి చూపించండి!

విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్



హుజూర్‌నగర్, నవంబర్ 07 (సింగిడి): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హుజూర్‌నగర్ ఎన్ఎస్పీ క్యాంపు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను ప్రధానోపాధ్యాయులకు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

★225 మంది విద్యార్థులకు దాతల చేయూత★

రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), ప్రాణిక్ హీలింగ్ యోగ సంస్థ సంయుక్త సహకారంతో హుజూర్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 225 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజుల నిమిత్తం రూ.56,250 అందించారు. ఎస్టీయూ సంఘం నాయకులు పాలూరి అంజయ్య, ప్రాణిక్ హీలింగ్ యోగ సంస్థ ప్రతినిధి యరగాని రామకృష్ణ ఈ ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. దాతలు ఆయా పాఠశాలలకు స్వయంగా వెళ్లి ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజులను అందజేశారు.

★ప్రభుత్వ విద్యా బలోపేతానికి తోడ్పాటు★

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని దాతలు పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో పరీక్ష ఫీజులను అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి బి. సైదా దాతల సేవా గుణాన్ని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహబూబ్ జాని, నర్సిరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అత్తి వెంకటేశ్వర్లు, ఆర్. శ్రీనివాసరావు, కె.వి. సత్యనారాయణ, కర్నె వెంకటేశ్వరరావు, పీఆర్‌టీయూ నాయకులు వేముల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటయ్య, బాలు, నాగమణి, దేవిశెట్టి రవి, జయప్రద, శైలజ, జయమ్మ, అరుణ, నాగలత, లక్ష్మీ నరసయ్య, జావేద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిక్కనూర్, నవంబర్ 7 (సింగిడి): బిక్కనూర్ మండలం మోటాటిపల్లి గ్రామంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ గంధం భూమయ్య, ఉపసర్పంచ్ సూరెడ్డి రాజిరెడ్డి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు, తిప్పాపూర్ పిఏసిఎస్ చైర్మన్ తిరుపరి భీమ్ రెడ్డి లు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మోటాటి భాస్కర్ రెడ్డి, బిమరి వెంకటేష్, గడ్డమీద లావణ్య, బుర్ర లావణ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి సుష్మ, వీడీసీ అధ్యక్షుడు బోయిని భాస్కర్, తిప్పాపూర్ సర్పంచ్ కుంట లింగారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కృషి పట్టుదలకు మారుపేరు బిక్షంగౌడ్



మునుగోడు, నవంబర్ 7 (సింగిడి): మునుగోడులోని పిఆర్ఆర్ గార్డెన్లో జరిగిన పిఆర్టియు టీఎస్ రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు మునుగోడు ఎంపిపి ఎస్ ప్రధానోపాధ్యాయులు సుంకరి బిక్షం గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని బిక్షం గౌడ్ ని సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిక్షం గౌడ్ కి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు, తెలియజేస్తున్నానని అన్నారు. కమిట్మెంట్ ఉంటే ఏ పనైనా చేయొచ్చని, కృషి, పట్టుదల, దీక్షకు మారుపేరు బిక్షం గౌడ్ అని అన్నారు. ఉపాధ్యాయుడుగా కమిట్మెంట్తో పని చేస్తూ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారని గుర్తు చేశారు. ఇటువంటి వ్యక్తులకు రిటైర్మెంట్ అనేది ఉండదు. ఇన్ని రోజులు ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు సేవలందించారని, నీలాంటి కమిట్మెంట్ ఉన్న వ్యక్తి సమాజానికి సేవ అందించాలని బిక్షం గౌడ్ కు మొట్టమొదట చెప్పిన వ్యక్తిని నేనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో అవినీతి పేరుకు పోతుంది. అవినీతి పారద్రోలేంత వరకు పేదలకు న్యాయం జరగదని నాయకుడనే వాడు నీతిగా ఉంటే సమాజానికి నీతి వంతమైన పాలన అందించగలరని తెలిపారు.నాయకులు అవినీతికి పాల్పడితే సమాజంలో పేదలకు న్యాయం జరగదని ఆయన అన్నారు. పి ఆర్ టి యు అభ్యర్థిగా సుంకర బిక్షం గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ మద్దతు కావాలని ప్రయత్నం చేశాను. బీసీలకు పెద్దపీట వేయాలని ఉద్దేశంతోనే సుంకరి బిక్షం గౌడ్ కి టికెట్ ఇవ్వాలని రాష్ట్ర అధిష్టానానికి చెప్పానని అన్నారు. ప్రజలే న్యాయ నిర్ణేతలు కాబట్టి ప్రజల నిర్ణయానికి వదిలివేయాలని అన్నారు. 9,000 కోట్లతో కొడంగల్లో సీఎం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. కొడంగల్ అభివృద్ధి పనులు ఇవ్వొద్దనేది నా ఉద్దేశం కాదు. మునుగోడు ప్రజలు ఏం పాపం చేశారు మాకెందుకు నిధులు ఇవ్వరు.నీకు అదృష్టం కలిసి వచ్చి ముఖ్యమంత్రి అయ్యావు దానిని నేను తప్పు పట్టట్లేదు. ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్లోరైడ్ తో బాధపడుతున్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలన్న తపన ఉంది కాబట్టి ఇలా మాట్లాడవలసి వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గరికి చాలాసార్లు వెళ్లి ప్రయత్నం చేసిన మునుగోడు నియోజకవర్గాని నిధులు మాత్రం ఇవ్వటం లేదని, దానివలన నేను తట్టుకోలేకపోతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో, పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘం నాయకులు, తదితరులున్నారు.



మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవు!

గద్వాల బ్యూరో నవంబర్ 7(సింగిడి): మైనర్ బాలురు వాహనాలు నడుపుతూ రోడ్లపై ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో గద్వాల పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు నడుపుతున్న వాహనాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో సుమారు 15 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ టంగుటూరి శ్రీనివాస్,పట్టణ ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తమ పోలీసు సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురను ఆపి పరిశీలించడంతో పాటు వారికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీసులు మైనర్ బాలురకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ.. 18 ఏళ్ల నిండే వరకు వాహనాలు నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐ టంగుటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మైనర్ బాలురు డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని, సరైన డ్రైవింగ్ అనుభవం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాహనాలు నడిపేందుకు అనుమతించవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 7 (సింగిడి): నాగర్ కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీలను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ పట్టుదల ఐకమత్యం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకొని జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ నాగర్ కర్నూల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి తూడుకుర్తి సర్పంచ్ లక్ష్మి కరుణాకర్ రెడ్డి ఉప సర్పంచ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



గోదావరిఖని నవంబర్ 07 (సింగిడి): మండలంలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ అనుబంధ మోర్చాలకు నూతన సారథులను నియమించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ నేతృత్వంలో వివిధ మోర్చాల మండల అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు: అరికెటి ఓంకార్ (గోల పల్లి), ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు: పిడుగు రమేష్ (గుండారం), కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు: సాగంటి లక్ష్మణస్వామి (పెంచికలపేట్), ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు: మేదరి లింగస్వామి (నాగారం). ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్షులకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. యువత, రైతులు, బీసీ, ఎస్సీ వర్గాలను సమన్వయం చేసుకుంటూ కమాన్‌పూర్ మండలంలో బీజేపీకి మరింత ప్రజాదరణ తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ నియామకాలకు సహకరించిన మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల సునీల్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మోర్చా అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చ గిరి రాము, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి అజయ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పంతకాని విశ్వతేజ, మండల ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, పిల్లి చంద్రయ్య, మోర ప్రశాంత్, చిప్పకుర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీఏ కులాలను గోసపెడుతున్న ప్రభుత్వం



నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 7, (సింగిడి): కులాల గ్రూపుల సర్దుబాటుపై ముఖ్యమంత్రి ఆలోచన సరైంది కాదని ఇట్టి విషయమై నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో గల వాల్మీకి మందిర ప్రాంగణంలో సమావేశమైన వాల్మీకి కుల సంఘం జిల్లా నాయకులు. దీనిలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి (డీ)లో ఉన్న ముదిరాజు లను ఇటీవల ఒక కార్యక్రమంలో ఆయన బీసీ (ఏ) లోకి మారుస్తామని ప్రకటించడంతో బీసీ (ఏ) లో ఉన్న వాల్మీకి బోయలు, చాకలి, మంగలి, మేధర, గంగపుత్ర, వడ్డెర కులస్తులు ఆందోళన చెందుతున్నారని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నారాయణపేట పట్టణ వాల్మీకి అధ్యక్షులు బోయ లక్ష్మణ్ ఆధ్వర్యంలో వాల్మీకి సోదరులు ప్రత్యేకంగా సమావేషమై మాట్లాడుతూ ఇప్పటికే ఎలాంటి కులవృత్తి లేకుండా ఎంతో నష్టపోయామని ఈ సందర్భంగా అన్నారు. అలాంటిది బీసీ (డీ) లో ఉన్న ముదిరాజులను బీసీ(ఏ) తీసుకువస్తే అందరూ నష్టపోతారని వాపోయారు. వాల్మీకి రాష్ట్ర నాయకులు లొట్టి శ్రీను మాట్లాడుతూ 1976 లో అలాగే 1977 లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా కాసు బ్రహ్మానంద రెడ్డి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో నుంచి వారిని బీసీ(ఏ)లోకి మార్చి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేయడంతో అనాటి ముఖ్యమంత్రి అయిన కాసు బ్రహ్మానందం రెడ్డి కీలక పాత్ర వహించి వాల్మీకి బోయల గొంతు నొక్కారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కొన్ని ప్రాంతాల్లో వాల్మీకి బోయలు ఎస్టీ లుగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో ఎస్టి జాబితా లో పరిగణించబడ్డారని, భారతదేశం మొత్తం లో చూసుకుంటే కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఏ రాష్ట్రంలో అయినా, ఏ ప్రాంతాలలో చూసుకున్న మొత్తం వాల్మీకి బోయలను ఎస్సీ లుగా, ఎస్టీ లుగా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఎస్టీ హోదా లేకుండా, ఎస్సీ హోదా కాకుండా బీసీ (ఏ) లోకి మార్చబడిన వాల్మీకులు, ఎలాంటి కులవృత్తి లేకున్నా, వాల్మీకి బోయలు గడ్డు పరిస్థితుల బ్రతుకీడుస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు . ఈ రోజుల్లో అందరికీ కులవృత్తి ఉందని, ఎలాంటి కులవృత్తి లేని వాల్మీకి బోయలు బిసి (ఏ) లో కొనసాగుతుంటే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందం రెడ్డి, నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ (ఏ) లో ఉన్న కులాల గొంతు కోస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి పట్టణ అధ్యక్షులు బోయ లక్ష్మణ్, బోయ రమేష్, బోయ కథలప్ప , బోయ రాములు, లోటి శ్రీను, బోయ హోటల్ వెంకటయ్య, బోయ అంజప్ప, చంద్రశేఖర్, ఆనంద్, కమల్, హుస్సేనప్ప, అప్పి, డాలర్ శ్రీను, గౌతమ్, కిషోర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం

నాగర్‌కర్నూల్ నవంబర్ 7 (సింగిడి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థి బండారి గణేష్ ప్రతిభ చాటాడు. ఖమ్మం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–17 విభాగంలో 3 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించాడు. లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న గణేష్ రాష్ట్రస్థాయిలో పతకం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్ విద్యార్థి గణేష్‌ను అభినందించారు. క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కోచ్ రానా మల్లేష్ ఆధ్వర్యంలో లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్‌లో గణేష్‌కు అభినందనలు తెలిపి చిరు సన్మానం నిర్వహించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కోచ్ పేర్కొన్నారు. గణేష్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించేలా మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారంతో పాటు నిరంతర సాధన ప్రధాన కారణమని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీస్తూ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ సేవలను పలువురు అభినందించారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

* క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి
* పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కోడేరు నవంబర్7(సింగిడి): ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం, ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపిస్తూ దాటవేత ధోరణి అవలంబించడం సహించేది లేదని హెచ్చరించారు.కోడేరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి, మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం నాడు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా వినతుల పరిష్కారంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించకుండా, సరైన విచారణ జరపకుండా పరిష్కరించినట్లు చూపించడం లేదా పరిష్కారంలో జాప్యం చేయడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, కోడేరు తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఎందుకు వస్తోందని అధికారులను ప్రశ్నించారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, అధికారులు కేవలం అర్జీలు స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయడంతో తమ బాధ్యత ముగిసినట్లు భావించరాదని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

కోడేరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 395 ప్రజా వినతులు అందినట్లు సమీక్షలో వెల్లడైంది. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు 62, వ్యవసాయ శాఖకు 4, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌కు 22, విద్యాశాఖకు 4, డీఆర్‌డీఓకు 14, దేవాదాయ శాఖకు 11, మహిళా శిశు సంక్షేమ శాఖకు 5, గృహ నిర్మాణ శాఖకు 21, నీటిపారుదల శాఖకు 29, పంచాయతీరాజ్ శాఖకు 116, విద్యుత్ శాఖకు 14, ఆర్టీసీకి 8, ఇతర శాఖలకు 85 వినతులు అందాయి.

వీటిలో 210 వినతులు ఇంకా విచారణ, పరిష్కార దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో 25, పంచాయతీరాజ్ శాఖలో 73, ఇతర శాఖల్లో 45 వినతులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడైంది.

ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సమస్యలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, ఇళ్ల నిర్మాణం వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, అదే బాధ్యత అధికార యంత్రాంగంలోనూ కనిపించాలని మంత్రి అన్నారు. ప్రతి వినతికి సంబంధించి తీసుకున్న చర్యలు, పరిష్కారానికి పట్టే సమయం, పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, అవసరమైతే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల పనితీరును సమీక్షిస్తామని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ అధికారులు జవాబుదారితనంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ప్రజలు తమకు ఎదురయ్యే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలను రాతపూర్వకంగా సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు స్పందించకపోయినా, సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగినా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోయినా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని గుర్తించి, అవసరమైన విచారణ చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించడం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని.ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెంపొందించడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.

అనంతరం "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ" అనే రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌లు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తించాలని వారు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి శ్రీకారం

పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొర్రూరు, నవంబర్ 7(సింగిడి): పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అన్ని వార్డులను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా మహబూబాబాద్జి ల్లా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో రూ.80 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న రహదారుల సమస్యలు, మురుగు నీటి పారుదల ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోవడం, మురుగునీరు సక్రమంగా వెళ్లకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించేందుకు సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తొర్రూరు పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా వాటి నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కేటాయించిన నిధులను సద్వినియోగం చేస్తూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తొర్రూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల వంటి అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు బాపు రెడ్డి, పెద్దగాని కళావతి సోమన్న, భద్రు నాయక్, బసనబోయిన ఐలమ్మ, పట్టణ అధ్యక్షులు, వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, మండల అధ్యక్షులు రవీంద్ర చారి, కౌన్సిలర్‌అ భ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సంబంధిత మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతదేహానికి నివాళి



గద్వాల ప్రతినిధి నవంబర్ 7 (సింగిడి)

జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజక వర్గం, ఇటిక్యాల మండలం శివనాంపల్లి గ్రామ ప్రస్తుత సర్పంచ్ జి. కృష్ణ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మృతి వార్త తెలుసుకున్న మాజీ జవాన్ మై రాముడు శివనాంపల్లి గ్రామానికి చేరుకుని, కృష్ణ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని ఓదార్చారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించిన జి. కృష్ణ ఆకస్మిక మరణం గ్రామానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.ఆయన మృతి పట్ల గ్రామ ప్రజలు, బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో శివనాంపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి): వనపర్తి పట్టణంలో జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ నిర్మాణం అంశం రాజకీయ విమర్శలకు వేదికగా మారుతోంది. జర్నలిస్టులకు అన్ని వసతులతో కూడిన ప్రతిష్ఠాత్మక ప్రెస్ క్లబ్ నిర్మించాలనే ఆలోచనను తాముస్వాగతిస్తున్నామని, అయితే సురవరం ప్రతాప్ రెడ్డి పార్కు స్థలంలో నిర్మాణం చేపట్టాలనే నిర్ణయాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కౌన్సిలర్ ఏర్వ అరుణ భర్త మెకానిక్ శ్రీను స్పష్టం చేశారు. శనివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి తొలి ఎమ్మెల్యే, ప్రముఖ సాహితీవేత్త, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త సురవరం ప్రతాప్ రెడ్డ జ్ఞాపకార్థం అప్పట్లో మున్సిపల్ తీర్మానం ద్వారా పార్కును ఏర్పాటు చేశారని వారు గుర్తుచేశారు. మహనీయుల సేవలను స్మరించుకునేలా నిర్మించిన పార్కు ప్రాధాన్యతను తగ్గించే విధంగా అక్కడ ఇతర నిర్మాణాలు చేపట్టడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ అవసరమ అయినప్పటికీ అందుకు అనువైన మరో స్థలాన్ని ఎంపిక చేయాలని కోరారు. జర్నలిస్టుల పట్ల ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి నిజమైన చిత్తశుద్ధి, అంకితభావం ఉంటే తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్నే ప్రెస్ క్లబ్‌గా మార్చి తన ఉదారతను చాటుకోవాలని గట్టు యాదవ్ సవాల్ విసిరారు. వనపర్తిలో అత్యంత ఖరీదైన రెండు నివాసాలు ఉన్న ఎమ్మెల్యే వాటిలో ఒకదానిలో క్యాంపు కార్యాలయాన్ని నిర్వహించుకోవచ్చని సూచించారు. జర్నలిస్టుల సమస్యను ముందుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు, ప్రతిపక్షాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని గట్టు యాదవ్, నందిమల్ల అశోక్ విమర్శించారు. పాత్రికేయ మిత్రుల భుజాలపై తుపాకీ పెట్టి రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవాలనే ప్రయత్నాలు సాగవని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ప్లాట్ల హామీ ఏమైంది?

ఎమ్మెల్యేకు జర్నలిస్టుల సంక్షేమంపై అంతటి చిత్తశుద్ధి ఉంటే గతంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హయాంలో శ్రీనివాస్‌పూర్ శివారులో కేటాయించినట్లు చెబుతున్న జర్నలిస్టుల ప్లాట్ల పంపిణీ ఇప్పటివరకు ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు తన సొంత డబ్బులతో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్రతి జర్నలిస్టుకూ ప్లాటు ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. జర్నలిస్టులకు హామీలు ఇవ్వడం, వారి సమస్యలను రాజకీయంగా ఉపయోగించుకోవడం కాకుండా ఆ హామీలను ఆచరణలో పెట్టాలని హితవు పలికారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అది అందరికీ ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కేంద్రంగా ఉండాలన్నదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాజకీయ కుట్రలు, కుతంత్రాలకు స్వస్తి పలికి జర్నలిస్టుల సంక్షేమానికి నిజాయితీతో కృషి చేయాలని వారు సూచించారు. ఈ సమావేశంలో పట్టణ యువత అధ్యక్షుడు సూర్యవంశం గిరి పాల్గొన్నారు

ఐడెంటిటీ కార్డుల పంపిణీ

నేలకొండపల్లి నవంబర్:07(సింగిడి)
బోదులబండ: విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని బోదుల బండ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చల్లగుండ్ల వెంకటరామయ్య సుమారు రూ.3,000 విలువైన స్టూడెంట్ ఐడెంటిటీ కార్డులను అందజేశారు. విద్యార్థుల పట్ల తనకున్న అభిమానంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐడెంటిటీ కార్డులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతు నరేంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్టెకోల నాగార్జున, డాక్టర్ అహ్మద్, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్.ఎం.సీ.) చైర్మన్ శ్రీమతి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఇల్లెందు నవంబర్ 7(సింగిడి): ఇల్లందు లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను ఇల్లందు పోలీసులు అరెస్టు చేసినట్లు ఇల్లందు వారి నుంచి మొత్తం రూ.27.51 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు.ఇల్లందులో పోలీసు స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ,

ఇల్లందు పట్టణ పరిధిలో గత కొంతకాలంగా జరుగుతున్న వరుస దొంగతనాలపై స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు . ఈ క్రమంలో దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నా మన్నారు. విచారణలో భాగంగా ఇల్లందు, జెకె కాలనీ , సుభాష్ నగర్, ఆజాద్ నగర్, వెంగల్ రావు నగర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 10 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు పేర్కొన్నారు.

అరెస్టయిన వారిలో లోడ్ విశాల్ కుమార్ (24), గౌతమ్ లోధ్ (26), కోరి కల్యాణ్ (20) ఉన్నారు. వీరు ఇల్లందులోని 14వ, 15వ నంబర్ బస్తీలకు చెందినవారిగా పోలీసుల

జనరల్ NEWS

సింగిడి

వరదలను నివారించేందుకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం ఎంతో అవసరం

డీపీఆర్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వివరాలు తెలియజేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి



హన్మకొండ, నవంబర్ 7 (సింగిడి): అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించి వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ నగరానికి సంబంధించి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్, హనుమకొండ చౌరస్తా అభివృద్ధి, మల్టీలెవెల్ కార్ పార్కింగ్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదే విధంగా వరంగల్ నగరంలో భవిష్యత్తులో వరదలను నివారించేందుకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం ఎంతో అవసరమని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే తయారు చేశామని, ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని వివరించారు. అందులో భాగంగానే ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధికి, హనుమకొండ చౌరస్తా, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కు సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌ల ను కూడా తయారు చేసి సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వరంగల్ నగరానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్ట్ ల డీపీఆర్‌ల పట్ల కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆత్మీయ పరిచయ కార్యక్రమం

హన్మకొండ, నవంబర్ 7 (సింగిడి): వరంగల్, ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో ఆత్మీయ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్ ఖాన్, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర నాయకులు జిల్లా కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. అనంతరం రెండు బార్ అసోసియేషన్లతో పాటు మహిళా బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఛాంబర్‌ను సందర్శించి న్యాయవాదులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రామారెడ్డి సర్వోత్తం రెడ్డి మాట్లాడుతూ, హనుమకొండ జిల్లా కోర్టు సముదాయంలో సుమారు 3 వేల మందికి పైగా న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారని, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది, క్లయింట్లతో కలిపి సమాజంపై విశేష ప్రభావం చూపగల మేధావి వర్గంగా న్యాయవాదులు ఉన్నారని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీ అని, అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు తమ సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకొచ్చారని, ముఖ్యంగా హెల్త్ కార్డుల సమస్యతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వరంగల్ నగర అభివృద్ధి గురించి మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థి, ప్రజాప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

వ్యవసాయ ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా..

మూడు ట్రాక్టర్లు సీజ్

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రవాణాశాఖ అధికారుల చర్యలు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 7 (సింగిడి): వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్లను వాణిజ్య రవాణాకు ఉపయోగిస్తున్న వారిపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తున్న మూడు వ్యవసాయ ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్, బాంబులగడ్డ ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అవసరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ మట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఫహిమ సుల్తానా, శ్రీనివాస్ పాల్గొన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య రవాణాకు ఉపయోగించరాదని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు నిరంతరం కొనసాగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న చాగంటి



హనుమకొండ, నవంబర్ 7 (సింగిడి): వరంగల్ మహానగరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డా,చాగంటి కోటేశ్వర రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ కోటేశ్వర రావును ఆలయ చైర్మన్ డా, బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి,రామేశ్వర్‌రావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డా,వాసవీ రెడ్డి, ప్రధానార్చకులు శ్రీభద్రకాళి శేషులు పూర్ణకుంభంతో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామంపడపంలో అ-ర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి తమ ప్రవచనం జరిపారు. ఈ సందర్భముగా శ్రీ చాగంటి కోటేశ్వరరావుని వారి ప్రవచనం వినుటకు అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న చాగంటి

హనుమకొండ, నవంబర్ 7 (సింగిడి): వరంగల్ మహానగరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డా,చాగంటి కోటేశ్వర రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ కోటేశ్వర రావును ఆలయ చైర్మన్ డా, బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి,రామేశ్వర్‌రావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డా,వాసవీ రెడ్డి, ప్రధానార్చకులు శ్రీభద్రకాళి శేషులు పూర్ణకుంభంతో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామంపడపంలో అ-ర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి తమ ప్రవచనం జరిపారు. ఈ సందర్భముగా శ్రీ చాగంటి కోటేశ్వరరావుని వారి ప్రవచనం వినుటకు అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



మిర్యాలగూడ నవంబర్ 7 (సింగిడి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అని అన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాల్ ద్వారా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు పున్నాకైలాష్ నేత హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 6వ తేదీన మిర్యాలగూడ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ , నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో పలు అభి వృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

- పీఎం రాహత్, రహవీర్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 7 (సింగిడి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. పీఎం రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ. 1. 50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందిస్తారని తెలిపారు. జిల్లాలో కిరణ్ ఆసుపత్రి, యోధా ఆసుపత్రి, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహకం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రహవీర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తారని వివరించారు. దేశవ్యాప్తంగా ఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జాతీయ స్థాయి అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని ఎస్పీ సూచించారు. ప్రమాద బాధితులను చూసి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మానవతా దృక్పథంతో స్పందించాలని, సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు.

దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

- ఆలేరులో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహణ
- దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు
- ఎంఈఓ ఎర్ర లక్ష్మి



ఆలేరు, నవంబర్ 7 (సింగిడి): దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎర్రలక్ష్మి అన్నారు. ఆలేరు మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎర్రలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు నేడు విద్య, క్రీడలు, ఉద్యోగాలు తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలుస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రభుత్వం సైతం దివ్యాంగుల కోసం అనేక విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగుల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పిస్తూ అన్ని విధాలా చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలతో పాటు వివిధరకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. నిర్వాహకులు విజేతలను అభినందించారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భవిత కేంద్రం విద్యార్థులతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులందరూ పాల్గొనాలని ఆమె ఆహ్వానించారు. విద్యార్థులు తమ ప్రతిభను జిల్లా స్థాయిలో కూడా చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ శ్రీనివాస్, స్పెషల్ ఎస్‌జీటీ రమేష్, ఎంఆర్‌సీ సిబ్బంది రాధిక, తిరుపతి, బాబా, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదు

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారుల హెచ్చరిక
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారుల అభ్యర్థిని బరిలో నిలుపుతాం
- ఇక్కిరి శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్



ఆలేరు, నవంబర్ 7 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని తెలంగాణ ఉద్యమకారుల మండల కో-కన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్, కోశాధికారి జంపాల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలోని క్రాంతినగర్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నప్పటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతుండటం విచారకరమన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ హామీలను అమలుకు నోచుకోకుండా చేస్తోందని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అమరవీరుల ప్రాణత్యాగాలు, ఉద్యమకారుల ధైర్యసాహసాలు, వీరోచిత పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. అలాంటి ఉద్యమకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యమకారుల సమస్యలను తక్కువగా చూస్తే సహించేది లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులంతా ఏకమై మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాబోయే రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఉద్యమకారుల అభ్యర్థులను బరిలో నిలిపే అంశంపై ముందుకు సాగుతామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యమకారులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్ర జాన్సన్, మొరిగాడి అశోక్, చెక్క వెంకటేష్, బడుగు జాంగిర్, జింకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు ప్రక్రియను పరిశీలించిన డీఎంహెచ్ఓ అప్పయ్య



హన్మకొండ, నవంబర్ 7 (సింగిడి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానపర్తి ఉప కేంద్రం లో జరుగుతున్న గర్భిణుల నమోదు కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా నుండి 4 సూపర్ వైసర్ బృందాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేసేందుకు డాక్టర్ రజిత ప్రోగ్రాం ఆఫీసర్ గా నియమించడం జరిగిందని అందుకు గ్రామంలో గర్భిణుల నమోదు స్థితిగతులను పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమంది గర్భిణులు నమోదు అయ్యారు, ఇంకా ఎంతమంది నమోదు కావాల్సి ఉందనే వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల గుర్తింపు, ముందస్తు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించారు. ప్రతి గర్భిణిని మొదటి మూడు నెలల్లోనే గుర్తించి, తప్పనిసరిగా ఏ ఎన్ సీ నమోదు చేయాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిత, పి హెచ్ యన్, శోభ, హెల్త్ సూపర్ వైసర్ , రమాదేవి, పద్మజ, సంపత్, భద్రయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐడియల్ కంపెనీలో భారీ పేలుడు..



- నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం..
- ముగ్గురిని హైదరాబాద్‌కు తరలింపు

నల్లగొండ ప్రతినిధి నవంబర్ 7 (సింగిడి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి సమీపంలోని ఐడియల్ కంపెనీలో బ్లాస్టింగ్ ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. బ్లాస్టింగ్ ధాటికి భవనంలోని భాగాలు పేలుడు తీవ్రతకు చెల్లా చెదురుగా ఎగిరిపడటంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమా దంలో గాయపడిన వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, మరొకరికి కామినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ముగ్గురు ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు కాగా, మరొకరు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 7 (సింగిడి): నల్లగొండ పట్టణంలోని 9వ డివిజన్ పరిధిలో సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలనీ వాసులతో కలిసి రోడ్డు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీ, వసుంధర కాలనీ, పటేల్ నగర్, సూర్యవంశం కాలనీ, చైతన్యపురి కాలనీలకు అనుసంధాన రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం 100 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడితే ఈ కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ భువనగిరి దేవేందర్, 9వ డివిజన్ కార్పొరేటర్ దీప్లా నాయక్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, గోపగోని స్వాతి, రాజశేఖర్ గౌడ్, టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దండంపల్లి సత్తయ్య, రావుల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేపా రాంరెడ్డి, గోపగోని యాదయ్య, నరసింహ, మారేష్, సైదులు, దేవరపల్లి ముత్తిరెడ్డి, మాధవరెడ్డి, కన్నెబోయిన రమేష్, కునుకుంట్ల శంకర్, కందుల నరేందర్, మన్నెం రాము, ముత్తిరెడ్డి, మాధవరెడ్డి, నేర్లకంటి సుధాకర్, నీలకంఠం నాగార్జున, లింగస్వామి, మామిడాల కృష్ణ, సురేష్ రెడ్డి, సత్యం, మాకమల్ల శివ, రుద్రాక్ష రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక గాలి వానల ప్రభావంతో రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ నవంబర్ 7 (సింగిడి): మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రస్తుతం కురుస్తున్న ఆకస్మిక గాలి వానలు, రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ

జనరల్ NEWS

సింగిడి

మాదిగల అభ్యున్నతికి సంఘాల ఐక్యతే బలం

మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి

రిజర్వేషన్ల ఫలాలు ప్రతి మాదిగ విద్యార్థికి అందాలి





సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి): మాదిగల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి ఎం ఎస్ ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద గల మంజీరా హోటల్‌లో అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎం ఆర్ పి ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైసగాళ్ల బుచ్చేంద్ర మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి బుంజూరు విజయ్ మాదిగ, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వి. ఎస్. రాజు మాదిగ, ఎం ఎస్ పి ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 32 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటం మాదిగ సమాజానికి కీలక విజయాలను అందించిందని పేర్కొన్నారు. సాధించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదిగలు ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక వివక్ష, వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు సమష్టి పోరాటం అవసరమని తెలిపారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని, ఎం ఆర్ పి ఎస్ అనుబంధ సంఘాలను గ్రామస్థాయి నుంచి నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వివిధ మండలాలకు ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సమైక్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ, మహా జన సోసలిస్ట్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ, మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి దేవరంపల్లి అశోక్ మాదిగ, ఎం ఎం ఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కగల కవిత మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ఫోటోల వెంకటేష్ మాదిగ, గంధగళ్ళ వీరయ్య మాదిగ, నల్లోల ప్రవీణ్ మాదిగ, పుర్రె సంతోష్ మాదిగ, నటరాజ్ మాదిగ, జెమిని జాన్ మాదిగ, మోహన్ మాదిగ, కందుకూరు యేసయ్య మాదిగ, జంగం నవీన్ మాదిగ, గంగేరి శ్రీనివాస్ మాదిగ, పోతురాజు శివ మాదిగ, సీమోను మాదిగ, సంసాన్ మాదిగ, రమేష్ మాదిగ, నిర్మల్ మాదిగ, పెంటయ్య మాదిగ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబర్ 7 (సింగిడి): తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని అర్హులైన 40 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు సకాలంలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన దరఖాస్తులపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెక్కులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్రావు, భాగ్యానంద్, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి, మల్లేశ్ చారి, బాలకృష్ణ, విజయ్ రెడ్డి, సుమన్ గౌడ్, సర్వేష్ యాదవ్, నవీన్ రాజు, గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మొగ్దంపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా నర్సింగ్ పవార్.. ప్రధాన కార్యదర్శిగా యేసయ్య ఏకగ్రీవం





సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 7 (సింగిడి): ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మొగ్దంపల్లి మండల నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నిమ్మల కిష్టయ్య, జిల్లా అధ్యక్షులు పెద్దాపురం దుర్గయ్య పర్యవేక్షణలో, జిల్లా ప్రధాన కార్యదర్శి పవర్ హీరాలాల్ ఆధ్వర్యంలో ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గౌరవ అధ్యక్షులుగా పాండు చౌహాన్, జాడి మల్కాపూర్), మండల అధ్యక్షులుగా నర్సింగ్ పవార్ (గూ ఇంగ్లీష్, జెడ్ పి హెచ్ ఎస్ మొగ్దంపల్లి), ప్రధాన కార్యదర్శిగా యేసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి సంఘ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఐక్యతను పెంపొందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

అనుమతి లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు

సాయి రామ్ బోర్వెల్ వాహనాలు సీజ్ భారీ జరిమానా

అక్రమ బోర్ల పై ఉక్కుపాదం : కాప్రా తాహసిల్దార్



కాప్రా, నవంబర్ 7 (సింగిడి): కాప్రా మండల పరిధిలోని మల్లికార్జున నగర్‌లో అనుమతులు లేకుండా బోర్ వేస్తున్న సాయిరాం బోర్ వెల్స్ వాహనాన్ని కాప్రా మండల తాసిల్దార్ మతిన్ ఆదేశానుసారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్వర్ణలత రెడ్డి సీజ్ చేస్తూ మండల కార్యాలయానికి తరలించారు. మంగళవారం సాయిరాం బోర్వెల్ యజమాని సీజ్ అయిన వాహనానికి 50 వేల రూపాయల డిడి కట్టి ఇట్టి బోర్వెల్ వాహనాన్ని మండల కార్యాలయం నుండి విడిపించుకున్నారు. ఈ సందర్భంగా కాప్రా మండల రెవెన్యూ అధికారులు మండల పరిధిలో అనుమతి లేకుండా ఎవరు బోర్లు వేసిన కఠిన చర్యల్లో భాగంగా వాహనాలు, బోర్ సీజ్ చేస్తూ భారీ జరిమానా విధిస్తామని తెలియజేశారు.

నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రికి ఆహ్వానం

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు



కాప్రా, నవంబర్ 7 (సింగిడి): ఉప్పల్ నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని కోరుతూ మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ల మర్యాద పూర్వకంగా కలిశారు. మేడ్చల్ జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రితో చర్చించారు. ఈ కార్యక్రమం లో ఏం ఎల్ ఏ మల్ రెడ్డి రంగ రెడ్డి, మల్ రెడ్డి రామ్ రెడ్డి, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగన్న ఆత్మీయ సమ్మేళనం

డీసీసీ అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 7 (సింగిడి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల కోసం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న ప్రమిద కన్వెన్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు . ఈ రోజు అంతా కార్యకర్తలకు అందుబాటు లొ ఉండడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొని కార్యకర్తల కష్టనష్టాలను వివరించి ,వారి సమస్యలకు పరిష్కరించడం కోసం కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పెంచడం కోసం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి గారు నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శవం ముందు కూడా ఈగోనా.. అణగారిన వర్గాల ఐక్యత సాధించేది ఇలాగేనా..

- అణగారిన వర్గాల ఐక్యత మాటల్లో కాదు చేతల్లో చూపించండి
- షాద్‌నగర్ ఘటనపై పెద్దల అసహనం



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి): శవం ముందు కూడా ఇగోనా, అణగారిన వర్గాల ఐక్యత సాధించేది ఇలాగేనా అంటూ షాద్‌నగర్‌లో జరిగిన ఘటనపై సర్వత్రా అసహనం ఆందోళన వ్యక్తమైయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో చర్చనియాం శమైయింది. బాధిత కుటుంబం కాళ్లు పట్టుకునే పరిస్థితి తెచ్చిన ఆధిపత్య పోరాటాలు సిగ్గుచేటని పలువురు అసహనం వ్యక్తం చేశారు. అమ్మాయి చనిపోయి మూడు రోజులైంది కుటుంబం కన్నీరుమున్నీరవుతుంటే మీ సంఘాల పంచాయితీలు ఏంటని ప్రశ్నించారు. ఐక్యత గురించి మాట్లాడే వారిలోనే ఇంత ఇగో వివక్షత ఉంటే అణగారిన వర్గాలు ఐక్యమయ్యేది ఎప్పుడని అన్నారు. లా విద్యార్థిని చంద్రకళ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఒక పేద కుటుంబానికి చెందిన అమ్మాయి ఉన్నత చదువులు చదువుతూ భవిష్యత్తులో కుటుంబానికి అండగా నిలుస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలిందని, అయితే ఈ విషాద ఘటనలో మరింత కలచివేసిన విషయం మరొకటని అమ్మాయి చనిపోయి మూడు రోజులవుతోంది. కుటుంబాన్ని పరామర్శించడానికి, ఆ అమ్మాయిని ఆఖరిచూపు చూడటానికి బంధువులు, వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు వస్తుంటారు. ఇలాంటి సమయంలో బాధిత కుటుంబానికి మనం అండగా నిలబడాలి. వారి బాధను అర్థం చేసుకోవాలి. వారికి మనోధైర్యం కల్పించాలి. కానీ అక్కడ జరిగిన పరిణామాలు చూస్తుంటే బాధేస్తోందని పలువురు అన్నారు. ఒక సంఘానికి చెందిన నాయకులు అక్కడే చాలా సమయం పాటు నిలబడటం, దానిపై మరో సంఘానికి చెందిన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం, ఇరువర్గాల మధ్య బలమైన వాగ్వివాదం చోటుచేసుకోవడం జరిగింది. పరిస్థితి కొద్దిసేపు ఉంటే ఘర్షణకు దారితీసేలా కనిపించింది చివరికి కుటుంబ సభ్యులే సహనం కోల్పోయి కాళ్లు పట్టుకొని వేడుకునే పరిస్థితి వచ్చింది. మా అమ్మాయి చనిపోయి మేము పుట్టెడు దుఃఖంలో ఉంటే, మా ఇంటి దగ్గర మీ పంచాయితీలు ఏంటని మీ గొడవలు ఏంటని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేసిందని పేర్కొన్నారు. ఈ దృశ్యాన్ని చూసిన వారంతా తలపట్టుకొన్నారని తప్పలేదని ఇది ఇరువర్గాలు ఆలోచించాల్సిన సమయమని అన్నారు. కుటుంబం కన్నీళ్లలో ఉంటే ఆధిపత్యాన్ని చూపించుకోవాలని అలమటించడం విచారకరమని బాధిత కుటుంబం ముందు మన సంఘాల పేర్లు, వ్యక్తిగత ఇగోలు, ఇరువురి మధ్య ఉన్న విభేదాలు అంత ముఖ్యం కాదని అణగారిన వర్గాల ఐక్యత కావాలని, మాట్లాడుకుంటున్న తరుణంలో అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న తరుణంలో ఇరువురి మధ్యనే ఇంతటి ఇగోలు, వివక్షత, ఆధిపత్య పోరాటాలు ఉంటే మనం ఎప్పుడు ఐక్యమవుతామని స్వంత సామాజిక వర్గం మేధావులు ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం కలిసి పోరాదేది ఎప్పుడని మనం మారాలని మన ఆలోచనా విధానం మారాలని, ఒకరి బాధలో మరొకరం భాగస్వాములు కావాలని ఒకరినొకరు గౌరవించుకోవాలని హితవు పలికారు. సంఘాల మధ్య పోటీ కంటే సమాజ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రకళ లాంటి మరో బిడ్డను కోల్పోకుండా యువతకు అండగా నిలబడటం మనందరి బాధ్యతగా వ్యవహరించాలని పలువురు పిలుపునిచ్చారు. ఇలాంటి విషాద సమయంలోనైనా విభేదాలను పక్కనపెట్టి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. ఒక్కసారి ఆలోచించండి మధ్యనే గొడవలు పడితే హక్కుల కోసం మనతో కలిసి పోరాడేవారు ఎవరని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- షామీర్‌పేటలో వైభవంగా ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం
- మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి): రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆ ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్టు మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గం శామీర్‌పేటలో కొలువై ఉన్న శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్టు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విలాసాగరం సుదర్శన్, పవన్ గౌడ్ వర ప్రసాద్ రెడ్డి శివ నరేందర్ గౌడ్, శ్రీకాంతా రెడ్డి గౌడ సంఘం నాయకులు, స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, నవంబర్ 7 (సింగిడి): భూసారాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి రైతులకు సూచించారు. కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ లతా శ్రీశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసుపోషణ, భూసంరక్షణపై 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను వినియోగిస్తూ సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. తద్వారా భూసారం పెరిగి నేల ఆరోగ్యం కాపాడబడుతుందని వివరించారు. అలాగే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందించి, సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూమేష్, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక భద్రతపై అవగాహన



కొడంగల్, నవంబర్ 7 (సింగిడి): అగ్నిప్రమాదాల నివారణ,అగ్నిమాపక భద్రతలపై కొడంగల్ లోని నవీన ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోడంగల్ అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాణసంచా వినియోగంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు మరియు ప్రమాదాల నివారణకు సంబంధించిన విలువైన సూచనలు అందించారు. విద్యార్థులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే దీపావళి వేడుకలు జరుపుకోవాలని, ప్రమాదకరమైన బాణసంచాకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో ఘనంగా యువజన ఉత్సవాలు

నవంబర్ 12న జిల్లా స్థాయి పోటీలు..

విజేతలకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం

రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 7 (సింగిడి): జిల్లాలోని యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించనున్నారు. 30వ జాతీయ యువజన ఉత్సవాలు--2027లో భాగంగా నవంబర్ 12వ తేదీన ఎల్.బి. నగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు.

పోటీలు.. అర్హతలు:

15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. వివిధ కళా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. – జానపద నృత్యం ((గ్రూప్): ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది (7 మంది నృత్య కళాకారులు, 3 మంది సహాయక కళాకారులు) పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా ప్రదర్శన ఉండాలి. సహాయక కళాకారుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చు. – జానపద గీతాలు: ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. భారతీయ సంప్రదాయ జానపద గీతాలకే ప్రాధాన్యత ఉంటుంది. సినిమా పాటలకు అనుమతి లేదు. – పోస్టర్ తయారీ: ూ3 పరిమాణంలో పోస్టర్ రూపొందించాలి. సమయం 90 నిమిషాలు. పోస్టర్‌పై సంస్థలు, బ్రాండ్ల పేర్లు ఉండకూడదు. 20 నుంచి 30 పదాలతో కూడిన శీర్షిక తప్పనిసరి. అవసరమైన సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. – వీధి నాటకం: ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది పాల్గొనవచ్చు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శన ఉండాలి. – కవితా రచన: తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో కవిత రాయవచ్చు. సమయం 60 నిమిషాలు. కవిత 500 పదాలకు మించకూడదు. ప్రతి కళాకారుడు ఒక పోటీ విభాగంలో మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం:

జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలు రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు ఎంపికవుతారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు 2027 జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం పొందుతారు.

దరఖాస్తుల వివరాలు:

పోటీల్లో పాల్గొనాలనుకునే యువతీ యువకులు తమ పేరు, పూర్తి వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్, పాల్గొనదలచిన పోటీ విభాగం వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. – దరఖాస్తులకు చివరి తేదీ: నవంబర్ 11, 2026– ఈమెయిల్: ఎర్వజూతీతీఏస్త్రమ్ఖఅశ్రీ.ఎశీఏ– ఫోన్: 9849909077– కార్యాలయం: జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా. – పోటీల తేదీ: నవంబర్ 12, 2026– సమయం: ఉదయం 9 గంటల నుంచి– వేదిక: ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్, ఎల్.బి. నగర్, హైదరాబాద్. జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమలోని కళా నైపుణ్యాలను ప్రదర్శించాలని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ రంగారెడ్డి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత పిలుపునిచ్చారు.

నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అధిక ధరలు వసూలు చేస్తే కఠినచర్యలు

అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి



మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 7 (సింగిడి): తెలంగాణ రాష్ట్రంలో నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ (సివిల్ సప్లై) విజయేందర్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలు వరుసగా తెలంగాణ బియ్యం: కిలో రూ. 66 తెలంగాణ సోనా బియ్యం: కిలో రూ. 74– తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం: కిలో రూ. 79 రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో, సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇంత వరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేయబడినవి. జిల్లా సరఫరల అధికారి సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు తనిఖి లు చేయచున్నారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదే విధంగా ప్రతి రిటైల్ హోల్ సేల్ వ్యాపారి వారి షాప్ ముందు ఈ క్రింది విధంగా బ్యానర్ డిస్ప్లే చేయాలని తెలిపారు.





సంక్రాంతి బరిలో మరో క్రేజీ ప్రాజెక్ట్..

అఫీషియల్ అప్డేట్ పోస్టర్ వైరల్

స్టార్ హీరో విజయ్ సేతుపతి అభిమానులకు గుడ్ న్యూస్ వచ్చింది. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పాకెట్ నావెల్' విడుదల తేదీ ఖరారైంది. ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గతంలో విజయ్ సేతుపతి, త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో వచ్చిన 'సూపర్ డీలక్స్' ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.

ఇప్పుడు మరోసారి వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇందులో విజయ్ సేతుపతికి జోడీగా మాళవిక మోహనన్ నటిస్తుండగా.. కన్నడ నటుడు రాజ్ బ. శెట్టి, కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సంక్రాంతి బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మరి ఈసారి విజయ్ సేతుపతి, త్యాగరాజన్ కుమారరాజా కలిసి ఎలాంటి విభిన్నమైన కథతో ప్రేక్షకులను అలరిస్తారో చూడాలి. సంక్రాంతి సినిమాల పోటీలో 'పాకెట్ నావెల్' ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాల్సిందే.

సినిమా సింగిడి
Cinma Singidi
ఆదివారం
8-11-2026

ఆ వీడియోలు షేర్ చేస్తే

చర్యలు తప్పవు..

మీమ్ పేజీలకు సురేఖావాణి స్ట్రాంగ్ వార్నింగ్

టాలీవుడ్‌లో తనదైన వైవిధ్యమైన నటనతో, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ముద్ర వేసుకున్న నటి సురేఖావాణి ప్రస్తుతం సైబర్ కేటుగాళ్ల బారిన పడ్డారు. కొందరు కేటుగాళ్లు ఆమెను టార్గెట్ చేస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని దుర్వినియోగం చేసి ఆమెకు సంబంధించిన మార్ఫింగ్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. ఈ విషయంపై తీవ్ర మనస్తాపానికి గురైన సురేఖావాణి, సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సైబర్ నేరస్థులకు, అలాంటి వీడియోలను షేర్ చేసేవారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయిందని, తన అనుమతి అసలు లేకుండానే తన వ్యక్తిగత, ప్రైవేట్ కంటెంట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని సురేఖావాణి ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఆ వీడియోలను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె మీమ్ పేజీలు, మీడియా మిత్రులు అలాగే ప్రెస్ సభ్యులను కోరారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ఆ ఫేక్ కంటెంట్‌ను షేర్ చేస్తే మాత్రం, వాళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె స్పష్టం చేశారు.





'కాకా' వాయిదా పుకార్లపై

కోన కౌంటర్..

మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'కాకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 13న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ఆలస్యం కావడం వల్ల వాయిదా పడబోతున్నట్లు సోషల్ మీడియాలో పలు పుకార్లు షికారు చేశాయి. ఈనేపథ్యంలో, తాజాగా ఈ రూమర్లపై ప్రముఖ రచయిత కోన వెంకట్ స్పందిస్తూ పుకార్లు పుట్టిస్తున్న వారికి దిమ్మతిరికే కౌంటర్ ఇచ్చారు. 'కాకా' సినిమా వాయిదా పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.





నైట్ టీషర్ట్‌తో రోడ్డుపైకి పరిగెత్తా..

ఆ టైమ్‌లో ఎవరిదగ్గర ఫోన్లు లేవు కాబట్టి సరిపోయింది..
షాకింగ్‌గా కరీనా కపూర్ కామెంట్స్

బాలీవుడ్ నటుడు, తన భర్త సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి జరిగినప్పుడు తాను సాయం కోసం రోడ్డుపై పిచ్చిదానిలా పరిగెత్తినట్లు కరీనా కపూర్ ఖాన్ వెల్లడించారు. ఆగంతకుడి దాడిలో గాయపడి రక్తమోడుతున్న సైఫ్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సాయం చేయాలంటూ గట్టిగా కేకలు వేసినట్లు తెలిపారు. 2025 జనవరి 16న మిడ్ నైట్ సుమారు 2 గంటల సమయంలో ఓ దుండగుడు ముంబయిలోని సైఫ్ అలీఖాన్ నివాసంలోకి చొరబడి దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో బాలీవుడ్ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆ భయానక రాత్రి వేళ చోటు చేసుకున్న పరిణామాలు, కుటుంబంపై దాని ప్రభావాన్ని తాజాగా 'కాఫీ విత్ కరణ్' షోలో ఈ జోడీ పంచుకుంది. 'నిజంగా అదొక సినిమా సన్నివేశంలా అనిపించింది. దాడి జరిగిన రాత్రి నేను నైట్ టీషర్ట్‌లోనే ఉన్నా. పైజామా వేసుకునే సమయం కూడా లేదు. అలాగే రోడ్డుపైకి పరిగెత్తా. కనిపించిన వాహనాలను ఆపుతూ గట్టిగా అరిచా. ఈ విషయం ఎవరికీ తెలియదు. మొదటిసారి చెబుతున్నా. అదృష్టవశాత్తూ ఎవరూ ఆరోజు వీడియో తీయలేదు. సైఫ్‌కు గాయమై రక్తం కారుతుంటే, పిచ్చిదానిలా రోడ్డుపై పరిగెత్తా' అని కరీనా వెల్లడించారు. ఘటన జరిగిన రోజు ఇంట్లో ఒక్క డ్రైవర్ కూడా లేకపోవడంపై కరణ్ ప్రశ్నించగా, సాయంత్రమయ్యేసరికి పనులన్నీ పూర్తి చేసుకుని డ్రైవర్లు ఇంటికి వెళ్లిపోతారని సైఫ్ తెలిపారు. దాడి జరిగిన సమయంలో సైఫ్ ఎంతో ధైర్యంగా ఉన్నప్పటికీ ఆ ఘటన తమ కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపిందని, దాదాపు ఆరు నెలల పాటు సరిగ్గా నిద్రపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

మన సంస్కృతిని తెలిపే సినిమాలో

నటించడం నా అదృష్టం..

కాజల్ అగర్వాల్



దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ బిగ్గెస్ట్ విజువల్ వండర్ 'రామాయణ' థియేటర్లలోకి వచ్చి సంచలనం సృష్టిస్తోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటించి మెప్పించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో కాజల్ అగర్వాల్ 'మండోదరి, రకుల్ శూర్పణఖ, యష్ రావణుడిగా కనిపించారు. అయితే ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు పొందుతూ.. బాక్సాఫీసు వద్ద దూసుకుపోతుంది. 'రామాయణ' సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో.. తాజాగా, తన పాత్రపై కాజల్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. మన భారతీయ సంస్కృతి, చరిత్రను తెలిపే 'రామాయణ' లాంటి సినిమాలో నటించడం తనకెంతో గర్వంగా ఉందని కాజల్ చెప్పింది. ఈ సినిమాలో తన పాత్ర నిడివి చిన్నదే అయినప్పటికీ, ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌లో భాగమవడం ఎంతో తృప్తిని ఇచ్చిందని, అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపింది. కొన్ని సినిమాలను పాత్రల నిడివితో, స్క్రీన్ టైమ్‌తో కొలవలేమని, అవి మన నమ్మకంతో ముడిపడి ఉంటాయని వివరించింది. తన చిన్న పాత్రను కూడా ప్రేక్షకులు ఎంతో ప్రేమగా ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపింది. అలాగే రణ్‌బీర్ కపూర్, యష్, సాయి పల్లవి, సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్‌ల నటనను ప్రశంసించింది.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737